
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 19 డిసెంబరు 2024



హత్యకేసులో ఆరుగురికి జీవితఖైదు

పెనుబల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం బ్రాహ్మలకుంట గ్రామానికి చెందిన ఏటుకూరి నర్సింహారావు హత్యకేసులో సత్తుపల్లి ఆరో ఏడీజే కోర్టు న్యాయాధికారి శ్రీనివాసరావు ఆరుగురికి జీవిత ఖైదీ, రూ.పదివేల జరిమానా, మరొకరికి కఠిన కారాగారశిక్షతోపాటు రూ.ఐదువేల జరిమానా విధించారు. ఈ కేసు 2019లో నమోదు కాగా బుధవారం బాణోతు గోపి, బాణోతు వెంకటేశ్వరరావు, బాణోతు భీమా, బాణోతు మోహన్, అజ్మీరా రవీంద్ర, బాణోతు కృష్ణతోపాటు వాంకుడోతు మంగమ్మ కఠినకారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చి'వరి' ఆశలు ఆవిరి!

- లీకులమయంగా తాలిపేరు ఆర్‌సీసీ ఛానల్
- ఎడమ కాల్వ పరిధిలో 3,100ఎకరాలకు అందని సాగునీరు
- ఆసియా ఖండంలోనే అతిపెద్ద నిర్మాణంగా గుర్తింపు
- నిర్వహణ లోపంతో మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలిన సీసీ కెనాల్
- 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేత ప్రారంభం
- 2013లో పూర్తిగా నిలిచిపోయిన నీటిసరఫరా



ఛానల్ దిగువ భాగంలో లీకవుతున్న నీరు



తాలిపేరుపై నిర్మించిన ఆర్‌సీసీ ఛానల్

దుమ్ముగూడెం డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు సాగు నీరందించాలనే లక్ష్యంతో వినూత్నంగా నిర్మించిన ఓ కాలువ మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. భద్రాద్రి జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం మండలంలో చివరి ఆయకట్టు భూములకు నీరందించే లక్ష్యతో నిర్మించిన ఆర్‌సీసీ(రీఇన్‌ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్) చానల్ నిరుపయోగంగా మిగిలింది. ఆసియాలోనే అతి పెద్ద ఆర్‌సీసీ ఛానల్‌గా పేరు పొందిన ఈ కాలువ పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరింది. ఈ ఛానల్ నిర్మాణాన్ని 1996లో ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేశారు. తాలిపేరు ఎడమకాల్వపై 1005 మీటర్ల పొడవుతో 65 స్తంభాలపై నిర్మించిన ఆర్‌సీసీ ఛానల్‌కు అప్పట్లో సుమారు రూ.1.40కోట్లు ఖర్చు చేశారు.

ఈ కాలువను 1998 ఆగస్టులో నాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించి నీటిని విడుదల చేశారు. ఈ ఛానల్ ద్వారా తాలిపేరు చివరి భూములకు నీరందించాల్సి ఉండగా.. ఆది నుంచే ఆ లక్ష్యాన్ని చేరుకోలేదు. ఘనమైన నిర్మాణంగా చెప్పిన ఈ కాలువ మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది.

మూణ్ణాళ్ల ముచ్చటే..

తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో ఎల్‌-4పై నిర్మించిన ఈ ఆర్‌సీసీ ఛానల్ ఆయకట్టు చివరన ఉన్న సింగారం, గంగారం, నిమ్మలగూడెం, ఎన్‌లక్ష్మీపురం, పొలూరిపేట ప్రాంతాల్లోని సుమారు 3,100 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. సింగారం -ఎన్ లక్ష్మీపురం, సింగారం -పొలూరి పేటలకు కాల్వల ద్వారా నీరు పారాల్సి ఉంది. కాగా ప్రారంభించిన తరువాత ఒకటి రెండేళ్లే పూర్తిస్థాయిలో పనిచేసిన ఈ ఛానల్ లీకులమయంగా మారి చివరకు 2013లో పూర్తిగా నిలిచిపోయింది. నాడు తవ్విన కాల్వలు కేవలం అలంకార ప్రాయంగా మిగిలాయి. కాగా తాలిపేరు ఎడమకాల్వలో భారీగా పూడిక ఏర్పడడంతో పాటు, ఆయకట్టు పెరగడంతో ఎల్‌-4లో ఆర్‌సీసీ ఛానల్ కలిసే ప్రాంతం వరకు సాగునీరు అందడం లేదు. కాలువ ఎగువన వానాకాలం పంట పూర్తయిన తరువాత మాత్రమే ఆర్‌సీసీ ఛానల్ వరకు సాగునీరు అందుబాటులోకి వస్తోంది.

లీకులమయంగా ఆర్‌సీసీ ఛానల్

3,100 ఎకరాలకు సాగునీరందించాల్సిన (మిగతా 6వ పేజీలో)

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న ప్రొఫెసర్


ఎస్ఆర్ బీజీఎన్ఆర్‌లో అక్రమాలపై విచారణ

- 15 రోజుల్లో నివేదిక అందించాలన్న కమిషనర్

ఖమ్మం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఎస్ ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో యూనిఫాం, ఎగ్జామినేషన్ బ్రాంచిలలో జరిగిన అక్రమాలపై బుధవారం విచారణ నిర్వహించారు. కళాశాల డ్రస్ మెటీరియల్ విక్రయాల్లో అధిక ధరల పేరుతో దోపిడీ చేశారనీ, ఎగ్జామినేషన్ బ్రాంచిలో ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి నగదు వేశారంటూ నవంబరు 6, 7 తేదీల్లో 'యూనిఫామ్ దందా, పరీక్షల బిల్లుల్లోనూ కక్కుర్తి' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురితమయ్యాయి. కాగా కథనాల పట్ల స్పందించిన కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా నల్గొండ జిల్లా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కపిలవాయి శ్రీనివాసరాజును నియమించారు. పదిహేను రోజుల్లోగా నివేదిక ఇవ్వాలంటూ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. (మిగతా 6వ పేజీలో)

ఏడాదైనా ఏవీ పదవులు!?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గడిచిన పదేళ్లు ప్రతిపక్షంలో పార్టీకోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు... పదవుల కోసం కొండంత ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పండుగలా జరుపుకొన్నా ఇంకా నామినేటెడ్ పోస్టులు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పదవులు వేసి ఉంటే ఇప్పటికే నాయకులు పదవుల్లో సగం కాలం గడిచిపోయేది. కొత్తవారికి కూడా తిరిగి అవకాశం వచ్చేది. జిల్లాలో ముగ్గురు మంత్రులు మధ్య సమన్వయం లేకపోవడంతో నియమిత పదవుల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఏకాభిప్రాయమే ప్రధాన సమస్య..

నామినేటెడ్ పదవులన్నీ ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు సిఫారసుతోనే భర్తీ చేస్తారు. అయితే పోటీ అధికంగా ఉండటంతో ప్రజాప్రతినిధులు తేల్చుకోలేకపోతున్నారు. దీనికి తోడు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో పదవుల నియామకంపై ఏకాభిప్రాయానికి రాకపోవడంతో కూడా కొంత సమస్యగా మారింది. ముగ్గురు మధ్య సమన్వయం లేకపోవడం, రెండు జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు కూడా ఇందుకు చొరవ తీసుకోకపోవడం ఆశావహులకు శాపంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులుగా ఎమ్మెల్యేలు సిఫారసు చేసే పదవుల కొన్ని ఉండగా, కొన్ని పదవులకు ముగ్గురు మంత్రులు సమన్వయంతో కమిటీలు ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. ఖమ్మం డీసీసీబీలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ల పదవుల నియామకం కూడా ముగ్గురు మంత్రులు మధ్య సమన్వయం లేకనే వాయిదా పడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఖమ్మంజిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో వేలు పెట్టడంలేదు. అధిష్టానం పట్టించుకోక జిల్లానేతలు కనికరించక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నలిగిపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రెండో ఏడాదికూడా పదవులు అందవేమోనని ముఖ్యనాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- ప్రజాపాలన విజయోత్సవాలు పూర్తయినా కానరాని స్పష్టత
- నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల నిరీక్షణ
- మంత్రుల మధ్య సమన్వయ లోపమే కారణమా..?
- రెండో ఏడాది కూడా పదవులు లేకుండా ఉండాల్సిందేనా..
- నేతల్లో అంతర్మథనం.. వినే నాథుడే కరవు

ఖమ్మం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేవాలయ, మార్కెట్ కమిటీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు పలు నియామక పదవులకోసం ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులు కొండంత ఆశగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్గంనుంచి రాయల నాగేశ్వరరావుకు గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ పదవి లభించగా, మంత్రి పొంగులేటి వర్గీయుడు మువ్వా విజయ్‌బాబుకు నీటిపారుదల సంస్థ ఛైర్మన్ పదవి లభించింది. భట్టి వర్గానికి చెందిన వైరా నేత నాయుడు సత్యనారాయణకు రాష్ట్ర హస్తకళా సంస్థ ఛైర్మన్ పదవి లభించింది. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి ఛైర్మన్ పదవులు లభించాయి. మంత్రి తుమ్మల వర్గానికి, రేణుకాచౌదరి వర్గానికి అవకాశాలు లభించలేదు. మలిదఫా ఛైర్మన్ పదవుల్లో అవకాశలు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. భట్టి, పొంగులేటి వర్గీయులు అదనపు కోటా ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో టికెట్లు ఆశించి దక్కని ఔత్సాహికులు కూడా పదవుల రేసులో ఉన్నారు. ఏడాదికాలంగా ప్రయత్నాలు చేసి అలిసిపోయారు.

ఊరిస్తున్న మార్కెట్, దేవాలయ కమిటీలు

ఖమ్మం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా)తో పాటు దేవాలయ, మార్కెటింగ్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో కొన్ని మార్కెట్ కమిటీలకు మాత్రమే నియామకాలు జరిగాయి ఖమ్మం జిల్లాలో మొత్తం ఎనిమిది మార్కెట్ కమిటీలుండగా సత్తుపల్లి, కల్లూరు, మద్దులపల్లి, నేలకొండపల్లి మార్కెట్‌కమిటీలకు నియామకాలు పూర్తయ్యాయి. ఖమ్మం, వైరా, ఏన్కూరు, మధిర మార్కెట్ (మిగతా 6వ పేజీలో)



మార్చురీ వద్ద మంగళవారం నిందితుడు గోపినాథ్

కన్న కొడుకే హంతకుడు...

- శ్రీవాణి అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ
- మద్యం కోసం డబ్బులు ఇవ్వడం లేదని కొడుకు ఆగ్రహం
- ఇంట్లోనే గొంతు పిసికి హత్య చేసి మెడలోని ఆభరణాలతో పారిపోయిన వైనం
- దొంగలు హత్య చేసినట్టుగా చిత్రీకరించేందుకు యత్నం
- తండ్రి ఫిర్యాదుతో అరెస్టు చేసిన పోలీసులు

ఖమ్మం క్రైం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో మంగళవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసులో చిక్కుముడి వీడింది. రోజూ మద్యం తాగి వస్తున్నాడని మందలించడంతో కక్ష పెంచుకున్న కుమారుడు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కన్న తల్లినే గొంతునులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఖమ్మం నగరంలోని 7వ డివిజన్ ఖానాపురంలోని బొడ్రాయి సెంటర్‌కు చెందిన కొప్పెర లక్ష్మీనారాయణ భార్య శ్రీవాణి(43) మంగళవారం మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే.. ఆమె మృతిపై అనేక ఊహాగానాలు వినిపించినా చివరికి ఆమె చిన్న కుమారుడు గోపినాథ్ ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

సెంట్రింగ్ పనులకు వెళ్లే గోపీనాథ్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో డబ్బు కోసం పలుమార్లు తల్లితో గొడవ పడి ఆమెను కొట్టాడు. ఇటీవల అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చిన గోపీనాథ్ ఇంట్లోనే వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు అతడితోనే ఇల్లు శుభ్రం చేయించారు. ఈ క్రమంలో రోజూ ఎందుకు (మిగతా 6వ పేజీలో)

తండ్రి ఇరుముడికి వెళ్లి వస్తూ...

- లారీ కింద పడి బాలిక దుర్మరణం
- మేనమామ బైక్ అదుపు తప్పడంతో ఘటన
- మృతురాలు వైరా గురుకులంలో ఏడో తరగతి విద్యార్థిని



చెరుకూరి హర్షశ్రీ

వైరా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి అయ్యప్పమాల ఇరుముళ్ల కార్యక్రమానికి వెళ్లి తిరిగి గురుకులానికి వస్తూ లారీ చక్రాల కింద పడి ఏడో తరగతి విద్యార్థిని దుర్మరణం చెందింది. ఖమ్మం జిల్లా వైరాలో బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న చెరుకూరి హర్షశ్రీ(13) గురుకులానికి కూతవేటు దూరంలోనే జాతీయ ప్రధాన రహదారిపై లారీ వెనుక చక్రాల కింద నలిగిపోయి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి...

రఘునాథపాలెం మండలంలోని కోయచిలక గ్రామానికి చెందిన హర్షశ్రీ వైరాలోని టీజీఆర్ఎస్‌లో ఏడోతరగతి చదువుతోంది. అయ్యప్పమాలలో ఉన్న తండ్రి చెరుకూరి వీరబాబు వైరా వచ్చి తన ఇరుముడి కార్యక్రమం కోసం కుమార్తె హర్షశ్రీని అనుమతి తీసుకొని స్వగ్రామమైన కోయచిలకకు తీసుకువెళ్లాడు. మంగళవారం తండ్రి వీరబాబు ఇరుముడి కార్యక్రమం జరిగింది. హర్షశ్రీ ఈ కార్యక్రమంలో ఎంతో ఉల్లాసంగా పాల్గొంది. తండ్రి శబరిమలైకు వెళ్లడంతో బుధవారం సాయంత్రం తన మేనమామ శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వైరాలోని గురుకుల పాఠశాలకు బయలుదేరింది. ఈ క్రమంలో జాతీయ ప్రధాన రహదారిపై మసీదు కాంప్లెక్స్ సమీపంలో ముందు వెళ్తున్న లారీ వెనుక చక్రాల కింద పడి హర్షశ్రీ నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందింది.

డివైడర్ పక్కన లారీ మరోవైపు మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్ ముందు వెళ్తుండగా ద్విచక్రవాహనంపై (మిగతా 6వ పేజీలో)

బీజేపీ వైఖరితో దేశ భవిష్యత్తుకు ముప్పు



సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు



మహాసభల్లో ప్రసంగిస్తున్న పార్టీ జాతీయ నేత బీవీ రాఘవులు

- విధ్వంస రాజకీయాలు చేస్తున్న బీజేపీ, సంఘ్ పరివార్
- జమిలి ఎన్నికల వెనుక నియంతృత్వ ధోరణి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- ప్రజల దృష్టి మరల్చటమే రేవంత్ లక్ష్యం: తమ్మినేని
- సత్తుపల్లిలో సీపీఎం 22వ జిల్లా మహాసభలు
- పట్టణంలో భారీ ప్రదర్శన

వివరాలు : 6లో

సిరుల 'సన్నాలు'

అశ్వారావుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన 'సన్నాలకు బోనస్' పథకం రైతుల మోములో చిరునవ్వులు కురిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,320కు అదనంగా సన్న ధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్‌ను చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది రైతుల్లో విపరీతమైన చలనం కలిగించింది. మొత్తం పంటలో 90శాతం వరకు సన్న రకాలను రైతులు పండించారు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం నియోజకవర్గంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాలలో వరి పంట 34,411 ఎకరాల్లో విస్తరించి ఉంది. మండలాల వారీగా అశ్వారావుపేటలో 3,324 మంది రైతులు 7,487 ఎకరాలలో వరి పంటను వేశారు. దమ్మపేట మండలంలో 9,700 ఎకరాల్లో, (మిగతా 6వ పేజీలో

- రూ.500 బోనస్‌తో అన్నదాతల మోములో చిరునవ్వులు
- ఎకరానికి దక్కుతున్న బోనస్ రూ.12వేల పైనే...
- నాలుగు రోజుల్లోనే జమ అవుతున్న డబ్బులు
- అటు మద్దతు ధర.. ఇటు బోనస్‌తో ఉత్సాహం



సన్న ధాన్యం కొనుగోలు దృశ్యం

మళ్లీ పెద్దపులి అలజడి

- మోతె అడవిలో సంచారం
- పాద ముద్రలు సేకరించిన అటవీ శాఖ అధికారులు
- అడవిలోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిక
- క్యాంపింగ్ సైట్‌ను సందర్శించిన ఉన్నతాధికారి

6

భారంగా బతుకీడ్చకుండా..

- ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకు లింకేజీ రుణం
- చొరవ తీసుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఆర్ధనారీశ్వర ఎస్‌హెచ్‌జీకి బ్యాంకు లింకేజీ లేఖను అందిస్తున్న బ్యాంకు మేనేజరు ప్రీతి

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లు భారంగా బతుకీడ్చకుండా, ఉపాధి కల్పించి వారికి గౌరవం పెంచేలా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవ తీసుకున్నారు. ఆయన సూచనతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ల స్వయం సహాయక సంఘానికి బ్యాంకు లింకేజీ రుణం అందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో అనేక పర్యాయాలు ట్రాన్స్‌జెండర్లను మహిళా స్వయం సహాయక సంఘాల్లో గుర్తించాలని కార్యాచరణ చేసినా అమలులోకి రాలేదు. ఖమ్మం నగరంలో 90 మందివరకు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారని కొంతమంది ట్రాన్స్‌జెండర్లను ఖమ్మానికి తరలించటంతో వారి సంఖ్య పెరిగింది. అయితే వారికి స్వయంఉపాధి చూపించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మెప్మా అధికారులకు సూచించారు. ఖమ్మం టీఎంసీ సుజాత, సీవో సల్మా ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్, చెర్వు బజార్, సారథినగర్‌లో ఉన్న పది మంది ట్రాన్స్‌జెండర్లను ఆర్ధనారీశ్వరి ఎస్‌హెచ్‌జీగా ఏర్పాటు చేశారు. వారితో బ్యాంకు ఖాతాలను తెరిపించారు. ఎస్‌హెచ్‌జీలో ఉండటం ద్వారా ఆర్థిక భరోసా, బ్యాంకు లింకేజీ రుణాలు, మాఫీ, బుక్ కీపింగ్‌పై మెప్మా సీవోలు ట్రాన్స్‌జెండర్ సభ్యులకు వివరించారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో అర్ధనారీశ్వరి సంఘానికి ఇండియన్ బ్యాంకు ద్వారా రూ.3లక్షల రుణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్ మాట్లాడుతూ మూడేళ్లుగా అర్ధనారీశ్వరి ఎస్‌హెచ్‌జీ కొనసాగుతోందని అన్నారు. బ్యాంకు లింకేజీ ఇవ్వక పోవటంతో టీఎంసీ సుజాత, సీవో సాల్మా ప్రత్యేక చొరవ తీసుకొని బ్యాంకు అధికారులతో మాట్లాడి బ్యాంకు లింకేజీ ఇప్పించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మెనేజరు ప్రీతి, ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, ఆర్పీలు లింగమ్మ, విజయలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో రామయ్యు పట్టాభిషేకం

భద్రాచలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ అనంతరం శ్రీరామదీక్షితుల కోసం భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకంగా రామయ్య పట్టాభిషేకంను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ముందు స్వామి వారికి సహస్రనామార్చన, నిత్య కల్యాణం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశావాహన నిర్వహించి సమస్త నదీ జలాలతో రామయ్యకు ప్రోక్షణ గావించారు. అనంతరం వాటిని భక్తులపై చల్లారు. ఈ సమయంలో శ్రీమద్రామాయణంలోని పట్టాభిషేక ఘట్టాన్ని వైదిక సిబ్బంది వివరించగా చివరగా ప్రసాద నివేదన తదితర కార్యక్రమాలతో పట్టాభిషేక కార్యక్రమం ముగిసింది. శ్రీరామదీక్ష విరమణ మంగళవారం నిర్వహించగా మరుసటి రోజు రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా రామయ్యకు పట్టాభిషేకాన్ని నిర్వహించారు.

సిరుల 'సన్నాలు'

(5వ పేజీ తరువాయి)

చంద్రుగొండలో 4,500 ఎకరాలు, అన్నపురెడ్డిపల్లిలో 7,917 ఎకరాలు, ములకలపల్లిలో 4,800 ఎకరాలల్లో వరి పంట వేశారు. ఎకరానికి సరాసరిగా 23 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ముందుగానే సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతుల్లో అధికశాతం సన్నరకాలైన 1262, 1638కెఎంఎం, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048 వంటి రకాలను రైతులు పండించారు. వర్షాలు సరిపడా రావడంతో దిగుబడులు బాగానే వచ్చాయి. సరాసరిన ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడులు రావడంతో ఐదెకరాలు పండించిన రైతులకు మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 చొప్పున రూ.62,500 బోనస్ రూపంలో రైతులకు వస్తున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతుంది. దీనికి తోడు ధాన్యం కొనుగోలు సొమ్ము48 గంటల్లోనే రైతుల ఖాతాలలో పడుతోంది. దీంతో రైతుల మోములో చిరునవ్వులు చిందిస్తున్నాయి.



బోనస్ రైతులకు వరం....

పర్సా రామారావు, అన్నపురెడ్డిపల్లి



సన్నధాన్యంపై బోనస్ ప్రకటించడం నిజంగా రైతులకు వరం లాటింది. చాలా ఏళ్లుగా వరి పండించిన రైతులకు నష్టాలు వస్తున్నాయి. తొలిసారిగా బోనస్ చెల్లించడంతో వరి పండించిన రైతులు ఆనందంగా ఉన్నారు. 10 ఎకరాలలో పంట పండిస్తే దాదాపు రూ.1,30,000లకుపైగా బోనస్ రూపేణ వస్తుండడం ఆనందంగా ఉంది.

బోనస్ కింద రూ.55వేలు వచ్చాయి..

తోట వెంకటేశ్వర్లు, కౌలు రైతు, దమ్మపేట



6 ఎకరాలను కౌలుకు తీసుకొని సన్నరకం ధాన్యాన్ని పండించాను. 110 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బోనస్‌తో అదనంగా రూ.55వేలు వచ్చింది. ఇది మరలా పంటను వేసుకోవడానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. రైతులకు ఇది ఎంతో మంచి కలిగిస్తుంది.

.రూ.2లక్షల 80 వేల బోనస్ వచ్చింది..

జెట్టి జగదీశ్వరరావు, రైతు, ఊట్లపల్లి



ఊట్లపల్లి గ్రామంలో 25 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకొని సన్న రకం వరిని పండించాను. 750 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బోనస్ రూపంలో రూ.2,80,000 అదనంగా వచ్చింది. రైతులకు ఈ విధమైన ప్రోత్సహకాలు ఉంటే దేశానికి అవసరమైన ఆహార ఉత్పత్తులను పండిస్తారు.

కొనుగోళ్లలో వేగం పెరగాలి...

ఇమాంసాబ్, రైతు, చంద్రుగొండ



ప్రభుత్వం సన్నధాన్యానికి బోనస్ ప్రకటించడం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. ఎకరానికి సరాసరిన రూ.10వేలకు పైగా బోనస్ రూపేణ వస్తోంది. అయితే కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి రూ.200 ఖర్చు అవుతోంది. మాయిశ్చర్, గోనె సంచులు అందుబాటులో లేక పోవడంతో కొనుగోళ్లలో ఆలస్యమవుతోంది.

మోతె అడవిలో పెద్దపులి

- పాద ముద్రలు సేకరించిన అటవీ శాఖ అధికారులు
- అడవిలోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిక



పులి పాదముద్రలు

కరకగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల పాటు అలజడి రేపి ములుగు జిల్లా అడవుల్లోకి వెళ్లిపోయిన పెద్దపులి.. తిరిగి భద్రాద్రి జిల్లా అడవుల్లోకి ఎంట్రీ ఇచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం మోతె అడవిలో పెద్దపులి సంచరించడంతో అటవీ గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మోతె అడవిలో బుధవారం మేకల కాపరికి పెద్దపులి కనిపించింది. దాంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా.. మణుగూరు డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో ఏడూళ్ళ బయ్యారం రేంజర్ ఉపేందర్ తన సిబ్బంది గోవింద్, సూరయ్య, రామదాసు, ఏడుకొండలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మోతె అటవీ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలను సేకరించారు. ఈ క్రమంలో అడవి సమీప గ్రామాలలో ప్రజలు, పశువుల కాపారులు అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని టంకా వేయించారు.

మరోవైపు నాలుగు జిల్లాల చీఫ్ కన్జర్ వేటర్ భీమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి క్రిష్ణ గౌడ్, మణుగూరు ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో బుధవారం చిరుమళ్ళ అటవీ ప్రాంతంలోని క్యాంపింగ్ సైట్‌ను పరిశీలించారు. పెద్దపులి చత్తీస్‌గఢ్ నుంచి బీట్ కోసమే వచ్చిందని అనంతరం ఇక్కడ నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆడపులి బీట్(ఎద) కోసం పెద్దపులి తిరుగుతుందని తెలిపారు. కరకగూడెం, ఆల్లపల్లి, తాడ్వాయి, ఏటూర్‌నాగారం, మంగపేట అటవీ ప్రాంతాలలో సంచరిస్తుందని వివరించారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగిని మృతి

- సమ్మె సందర్భంగా మానసిక ఒత్తిడే కారణమన్న సంఘాల నాయకులు
- కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ఖమ్మం ఖానాపురం హవేలి/ తిరుమలాయపాలెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్ష విభాగం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కె.హైమావతి(42) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. ఆమె 15 ఏళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. పదిరోజులుగా టీఎస్ఎస్‌యూఎస్ ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలని దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగం గా మంగళవారం ఖమ్మంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న హైమావతి ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతిరాలికి భర్త, కుమార్తె ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఇన్‌సెట్‌లో హైమావతి(ఫైల్)

ఉద్యోగుల ర్యాలీ

ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట కేబీనగర్‌లోని ఆమె నివాసానికి బుధవారం ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు వచ్చి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఝాన్సీ సౌజన్య ఆధ్వర్యంలో 300 మందితో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె నేపథ్యంలో జరిగిన పరిణామాలతో హైమావతి మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందారని తెలిపారు. హైమావతి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. హైమావతి మృతదేహానికి టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌ను కలిసి హైమావతి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు బుధవారం ఖమ్మంలో నిర్వహించారు.



సమీక్ష నిర్వహిస్తున్న పీవో

కొండరెడ్లకు వసతులు కల్పించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండలం పూసుగుంట గ్రామంలో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఉద్యాన, వ్యవసాయం, విద్యుత్, అటవీ శాఖ అధికారులతో ఆ గ్రామంలో కల్పించాలన్సిన వసతుల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి తుమ్మల పర్యటన సందర్భంగా గ్రామస్థులు కోరినవిధంగా రోడ్డు సౌకర్యం, పంటలు పండించుకోవడానికి కరెంటు, బోర్లు వేయడానికి ప్రతిపాదించామని అన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పనులను ఈ వారంలో ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజు, ఏడీ వెంకటరత్నం, డీహెచ్‌వో కిషోర్, డీఏవో బాహూరావు పాల్గొన్నారు.

తండ్రి ఇరుముడికి వెళ్లి వస్తూ...

(5వ పేజీ తరువాయి)

శ్రీకాంత్, హర్షశ్రీ వెనుక నుంచి వచ్చి రెండు వాహనాల మధ్య నుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా లారీ పక్కకు జరగడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. శ్రీకాంత్ ఒకవైపున పడిపోగా హర్షశ్రీ లారీ వెనుక చక్రాల కింద పడిపోయింది. ఆమె నడుము మధ్యభాగం నుంచి దాదాపు 100మీటర్ల దూరం లాక్కెళ్లింది. దాంతో చిన్నారి మృతదేహం ఛిద్రమైపోయింది. పర్లాంగు దూరం ప్రయాణిస్తే తాను చదివే గురుకులానికి చేరుకునేలోపే హర్షశ్రీని మృత్యువు కబళించింది. ఈ ఘటన తెలిసిన వెంటనే శబరికి వెళ్తా మార్గమధ్యలో ఉన్న తండ్రి వీరబాబు ఇంటికి వెనుదిగారు. హర్షశ్రీ తల్లి, చెల్లి, ఇతర బంధువులు సంఘటనాస్థలానికి చేరుకొని రోదించారు. గురుకులం ప్రిన్సిపాల్ బి.రమ సంఘటనాస్థలానికి చేరుకొని హర్షశ్రీ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనాస్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లాలోని 21 మండలాల నుంచి సుమారు 711 మంది క్రీడాకారులు హాజరైనారు.

పోటీల్లో భాగంగా మూడోరోజు అథ్లెటిక్స్(బాలురు, బాలికలు), జిమ్నాస్టిక్స్ (మెన్,ఉమెన్), లాన్‌టెన్నిస్(బాలురు, బాలికలు), రోయింగ్, షూటింగ్, చెస్(బాలురు, బాలికలు) విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు షఫీ, సాంబమూర్తి, ఆధర్శ్‌కుమర్, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, నగేష్, రామ్‌రాయల, కైలాష్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో...

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో సీఎం కప్ -2024 జిల్లా స్థాయి క్రీడలు మూడో రోజు బుధవారం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బాస్కెట్ బాల్, చెస్ మరికొన్న క్రీడల క్రీడా జట్టుల జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. యుజన క్రీడల జిల్లా అధికారి పరందామరెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు కొనసాగుతున్నాయి. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాన్సన్ డేవిడ్ (బాబు), మనీ నాయుడు ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రగతి మైదానంలో జిల్లా బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించి పురుషుల, మహిళా జట్లను ఎంపికలు చేసి ప్రకటించారు. అదేవిధంగా జిల్లా స్థాయి చదరంగం, వాలీబాల్, అథ్లెటిక్ క్రీడల పురుషుల, మహిళ క్రీడాకారులను ఎంపిక చేశారు. శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలను టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు ప్రారంభించారు.

చి'వరి' ఆశలు ఆవిరి!

(5వ పేజీ తరువాయి)

ఈ ఆర్‌సీసీ చానల్ ప్రస్తుతం పూర్తి లీకులమయంగా మారింది. ఈ లీకుల ద్వారా భారీగా నిరు దిగువకు కారుతోంది. పది సంవత్సరాలకు పైగా ఇదే పరిస్థితి ఉన్నా మరమ్మతులకు నోచుకోలేదు. కొన్నేళ్ల క్రితం రూ.47కోట్ల జపాన్ బ్యాంకు రుణంతో తాలిపేరు ఆధునికీకరణ పనులు చేపట్టినా ఆర్‌సీసీ ఛానల్ మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో చివరి ఆయకట్టు రైతులు వరిసాగుపై ఆశలొదిలేసి మెట్టపంటలు సాగు చేస్తున్నారు.

మంత్రి తుమ్మలపైనే ఆశలు

ఆసియా ఖండంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన కట్టడంగా పేరొందిన తాలిపేరు ఆర్‌సీసీ ఛానల్ నిర్మాణ సమయంలో తుమ్మల నాగేశ్వరావు భారీ నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆర్‌సీసీ ఛానల్ మరమ్మతులపై ఆదివాసీ రైతులు మంత్రి తుమ్మలపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఆయన ఆర్‌సీసీ ఛానల్ మరమ్మతులు చేపట్టి తమకు న్యాయం చేస్తారని ఆదివాసీ రైతులు ఆశిస్తున్నారు.

వర్షం వస్తేనే పంట

నూపా సీతయ్య, రైతు సింగారం



ప్రారంభించిన తొలినాళ్లలో ఒకటి, రెండు ఏళ్లు తప్ప ఆర్‌సీసీ ఛానల్ మాకు ఏనాడూ ఉపయోగపడ లేదు. వర్షం వస్తే తప్ప తమ పొలాల్లో పంటలు పండవు. ఛానల్ నిర్మించినా తమకు ఎటువంటి ప్రయోజనం కలగలేదు. ఇప్పటికైనా ఈ ఆర్‌సీసీ ఛానల్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి చివరి భూములకు సాగునీరందించాలి.

బీజేపీ వైఖరితో దేశ భవిష్యత్తుకు ముప్పు

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సత్తుపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కారణంగా దేశ భవిష్యత్తుకు ముప్పు పొంచి ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. బుధవారం సత్తుపల్లిలో సీపీఎం ఖమ్మం జిల్లా 22వ మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75ఏళ్లుగా అమలులో ఉన్న రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి వేసే ప్రయత్నంలో బీజేపీ ఉందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో సీపీఎం ఇతర కమ్యూనిస్టు పార్టీలు, లౌకిక శక్తులతో కలసి పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని ఆరోపించారు. బీజేపీ, సంఘ్ పరివార్‌లు విధ్వంస రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల కోసం చట్టాలు చేయాల్సి ఉండగా నల్లచట్టాలను బీజేపీ అమలు చేసే ప్రయత్నం చేసిందని, రైతు ప్రతిఘటనతో రద్దు చేసినట్లు నటిస్తోందన్నారు. వ్యవసాయం, విద్యుత్, బొగ్గుగనులు ఇతర అన్ని రంగాలను కేంద్ర ప్రభుత్వం అంబాని, అదానిలకు కట్టబెడుతోందని అన్నారు. మన దేశంలో ఉండాల్సింది హిందువులు మాత్రమేననే ధోరణిలో బీజేపీ, సంఘ్‌పరివార్‌లు వ్యవహరిస్తున్నాయని అన్నారు.

ఖర్చు, సమయం ఆదా అవుతుందని దేశ ప్రజలకు నమ్మించి బీజేపీ జమిలి ఎన్నికలను తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. జమిలి ఎన్నికల ద్వారా నియంతృత్వ ధోరణితో ఏక పార్టీ పాలన తీసుకొచ్చేందుకు బీజేపీ వ్యూహం ఉందన్నారు. బీజేపీ వలలో ప్రాంతీయ పార్టీలు కూడా పడిపోయాయని, ఇది శోచనీయమన్నారు. సాధారణ ఎన్నికల నిరంతరం ఎన్నికల నియమావళి అమలు కారణంగా అభివృద్ధి కుంటుపడుతోందని చెప్పటంలో అర్థం లేదన్నారు. పార్లమెంట్‌లో నిర్ణీత మెజారిటీ లేకున్నా కుట్రపూరితంగా బీజేపీ జమిలి ఎన్నికలపై ముందుకు సాగుతోందని ఆరోపించారు.

ప్రజల దృష్టి మరల్చుతున్న సీఎం

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వందల హామీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హామీలు అమలు చేయలేక హైడ్రాను తెరపైకి తెచ్చారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు ఆక్రమించి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించి సామాన్య, మధ్యతరగతి వారికి విక్రయించగా కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటూ ఇళ్లు కూలగొట్టారని అన్నారు.

మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు సీపీఎం వ్యతిరేకం కాదని కాని అక్కడ ఉన్న పేద ప్రజల 15వేల ఇళ్ల యజమానులకు ప్రత్యామ్నాయ ఇళ్లు ఇచ్చిన ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీని అడ్డుకునేందుకే గత పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం పోటీ చేయని సీట్లలో కాంగ్రెస్‌కు మద్దతి ఇచ్చిందే తప్ప కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏదో మేలు జరుగుతుందని కాదని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ తమ స్టేట్‌మెంట్లలో బూతులు తిట్టుకుంటూ ప్రజా సమస్యలు, హామీల అమలును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏమీ అమలు జరగటం లేదన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం కార్యకర్తలు నిత్యం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదైనా ఏవీ పదవులు!?

(5వ పేజీ తరువాయి)

కమిటీలకు నియామకాలు జరగలేదు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో ఆరు మార్కెట్ కమిటీలుండగా ఇల్లెందు, భద్రాచలం, దమ్మపేట మార్కెట్ కమిటీలకు నియామకాలు జరిగాయి. కొత్తగూడెం, చర్ల, బూర్గంపాడు మార్కెట్ కమిటీలకు ఇంకా నియామకం జరగలేదు.

ఉమ్మడిజిల్లాలో 600పైగా చిన్నాచితక దేవాలయాలున్నాయి. అందులో ప్రభుత్వం 6ఏ కింద 11 ఆలయాలు, 6బీ కింద 38, 6సీ కింద 42 ఆలయాల కమిటీలు ప్రభుత్వమే నియమిస్తుంది. మిగిలిన చిన్నాచితక కమిటీలకు గ్రామస్థులు, భక్తులు కమిటీలు వేసుకుని దేవాదాయశాఖకు పంపిస్తారు. జిల్లాలో ప్రభుత్వం నియమించే కమిటీలకు ఏడాదైనా ఒక్క కమిటీకూడా వేయలేదు. 6ఏ కింద భద్రాచలం, జమలాపురం నీలాద్రి, స్తంభాద్రి, మారెమ్మగుడి, కందుకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, కాల్వొడ్డు, పాల్వంచ పెద్దమ్మతల్లి, అన్నపురెడ్డి పల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెం గణేష్ ఆలయాలు ఉన్నాయి. జిల్లాలో కీలకమైన పలు శివాలయాలకు కూడా కమిటీలు వేయలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గ్రంథాలయ సంస్థ కమిటీలు, రాష్ట్రస్థాయిలో మరికొన్ని కార్పొరేషన్ చైర్మన్లు, పాలకవర్గాల సభ్యుల పదవులను కూడా పలువురు కూడా ఆశిస్తున్నారు. ఆర్టీసీ, రవాణా తదితర శాఖలకు సంబంధించిన కమిటీల పదవులపైకూడా కొందరు గురిపెట్టారు.

ఎస్‌ఆర్ బీజీఎన్‌ఆర్‌లో అక్రమాలపై విచారణ

(5వ పేజీ తరువాయి)

కాగా కమిషనర్ ఆదేశాలకనుగుణంగా బుధవారం శ్రీనివాసరాజు ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్‌లో విచారణ నిర్వహించారు. విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తోపాటు, ప్రిన్సిపాల్ నుంచి వివరాలు సేకరించారు. కళాశాలలోని విద్యార్థులకు 12 ప్రశ్నలతో కూడిన కాపీలను అందజేసి వారి నుంచి గోప్యంగా వివరాలను తీసుకున్నారు. ఆయా కాపీల్లో యూనిఫాం లకు ఎంత చెల్లించారు? అందుకు రశీదులు ఇచ్చారా? మిగిలిన చోట్ల ఆ యూనిఫాం మెటీరియల్ తక్కువ ధర ఉందని తెలుసా? ఎగ్జామినేషన్ ఫీజు ఎంత చెల్లించారు? వంటి పలు ప్రశ్నలతో వివరాలను సేకరించారు.

కాగా విచారణకు అధికారులు వస్తున్న విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ గోప్యం గా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. విద్యార్థి సంఘాలకు, చాలా మంది విద్యార్థులకు విచారణకు వచ్చే విషయాన్ని తెలియకుండా ఉంచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కన్న కొడుకే హంతకుడు..

(5వ పేజీ తరువాయి)

మద్యం తాగి వస్తున్నావని తల్లి శ్రీవాణి మందలించింది.

మంగళవారం మధ్యాహ్నం సమయంలో మళ్లీ ఇంటికి వచ్చి తనకు డబ్బులు కావాలని తల్లిని అడిగాడు. దీంతో ఆమె తన వద్ద లేవని, నాన్నను అడుగు అని చెప్పగా, గోపినాథ్ ఆగ్రహంతో ఆమెతో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో తల్లి ఆగ్రహంతో గోపినాథ్ చెంపపై కొట్టింది. అతడు వెంటనే ఆగ్రహంతో తల్లి గొంతు గట్టిగా పిసికాడు. దీంతో ఆమె నాలుక బయటపెట్టి పడిపోయింది. తల్లిమృతి చెందిందని గుర్తించిన గోపినాథ్.. దొంగలే హత్య చేసినట్లు చిత్రీకరించేందుకు ఆమె మెడలో ఉన్న ఆభరణాలు తీసుకొని అక్కడి నుంచి పారిపోయాడు.

కొద్దిసేపటి తరువాత ఆ ఇంట్లో గ్యాస్‌స్టవ్‌పై పాలుపొంగి మాడిన వాసన వస్తుండటంతో పక్కింట్లో ఉంటున్న ఓ మహిళ వచ్చి చూడగా శ్రీవాణి విగత జీవిగా పడి ఉంది. దీంతో స్థానికులను పిలువగా వారు వచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఖమ్మం ఖనాపురంహవేలి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. ఆ ఫిర్యాదులో తమ చిన్నకుమారుడు గోపీనాథ్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొనడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు.

దొంగలు హత్య చేసినట్టుగా చిత్రికరించేందుకు యత్నం

కన్న తల్లిని హత్య చేసిన గోపినాద్ ఇదంతా దొంగలు చంపి బంగారం దొంగిలించినట్టుగా చిత్రికరించే విధంగా ప్రయత్నం చేశాడు. ఎవ్వరికి అనుమానం రాకుండా ఉండేందుకు తల్లి మెడలోని బంగారు గొలుసు, చెవి దిద్దులను తీసుకుని పారిపోయాడు. గొలుసును కూడా తీయకుంగా మెడపై అచ్చులు పడేవిధంగా అనుమానం రాకుడదని గొలుసును లాగాడు. దీంతో గొలుసు అచ్చులు మెడపై పడ్డాయి. అదేవిధంగా చెవిదిద్దులు కూడా లాగడంతో దిద్దులు లాగిన విధంగా అచ్చులు పడ్డాయి. ఇదంతా దొంగలు బంగారం కోసం హత్య చేసి ఉంటారు అన్న విధంగా చిత్రికరించాడు. అవి చూసిన స్థానికులు మెదట దొంగల పని అన్న విధంగా అనుకున్నారు. తరువాత పోలీసులు వచ్చిన తరువాత అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గోపినాధ్‌ను అదుపులోకి తీసుకోవడంతో అస్సలు విషయం బయటకు వచ్చింది.

రిమాండ్‌కు తరలించాం: సీఐ భాను ప్రకాష్

గోపినాధ్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఖనాపురంహవేలి సీఐ భాను ప్రకాష్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యానికి బానిసైన గోపినాధ్.. మంగళవారం మధ్యాహ్నం తల్లితో గొడవపడి ఆమె గొంతు పిసికి హత్య చేశాడని, తండ్రి లక్ష్మినారాయణ పిర్యాదు మేరకు 103,305(ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి గోపినాధ్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

పేదల బతుకుల్లో ఆరోగ్యసిరి

- ఆరోగ్యశ్రీ పథకంతో 3649 మందికి లబ్ధి
- పేదల వైద్యానికి రూ. 3కోట్లు ఖర్చు
- ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో అందుబాటులో నిపుణులైన వైద్యులు



ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం పేదల బతుకుల్లో వెలుగు నింపుతోంది. నిరుపేదలకు ఈ పథకం సంజీవ నిలా పని చేస్తోంది. డబ్బుల్లేక మెరుగైన వైద్యం చేయించుకోలేని వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మా న్ భారత్ పథకంతో మన రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని అనుసంధానించారు. ఈ పథకం జిల్లా జనరల్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో 19 ప్రైవేటు ఆస్పత్రులతో పాటు 7 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ పథకం అమలు అవు తోంది. అంతే కాదు ఈ పథకం ద్వారా హైదరా బాద్ లాంటి కార్పోరేట్ ఆస్పత్రుల్లోనూ చికిత్స చేయించుకునే వెసులుబాటును కల్పించారు. అయితే ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ఈ ఏడాది వివిధ రోగాలతో శస్త్ర చికిత్సల కోసం ఆస్పత్రిలో చేరిన 3649మందికి ఆపరేషన్లు నిర్వహించారు. సుమారు రూ.3కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు అధి కారిక లెక్కలు చెబుతున్నాయి.

1584 రకాల వ్యాధులకు వైద్యసేవలు

ఆరోగ్యశ్రీ కింద 942 వ్యాధులు, ఆయుష్మాన్ భారత్ కింద 642 వ్యాధులు మెత్తం 1584 రకాల వ్యాధులకు ఉచింతంగా వైద్య తీసుకునే వెసులుబాటు ఉంది. గతంలో రూ.2లక్షలు వరకు ఉన్న పరిమితిని ఇప్పుడు రూ.10లక్షలకు పెంచారు. దీనితో పాటు ఆరోగ్యమిత్రల ద్వారా ఈ పథకం ద్వారా ఆస్పత్రిలో చేరిన రోగులకు పేదలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిం చడంతో పాటు పైసా ఖర్చు లేకుండా ఆనం దంగా వారిని ఇళ్లకు పంపించి కుటుంబాలకు దగ్గర చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద కుటుంబలో ప్రతీ ఒక్కరికీ వైద్యసేవలు పొంద వచ్చు. ప్రధానంగా మోకాలి చిప్పమార్పిడి, కిడ్నీ, గుండె కాలేయ వ్యాధులు ఇతర జబ్బులకు శస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చు. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో శిశువు నుంచి వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పథకం కింద సేవలు పొందేందుకు అర్హులు.

ఖరీదైన ఆపరేషన్లు ఉచితంగా

జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈ ఏడాది 3649 ఆపరేషన్లు వివిధ విభాగాల్లో వైద్యులు నిర్వ హించారు. పేదలకు ఉచిత వైద్యంతో పాటు ఇలాంటి ఖరైదైన ఆపరేషన్లు నిర్వహిస్తుండ డంతో రోగులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ ఆస్పత్రు లను ఆశ్రయిస్తున్నారు. జనరల్ సర్జరీ, గైనకా లజీ, కార్డియాలజీ లాంటి కీలక విభాగాల్లోనూ నిపుణులు ఉండడంతో ఈ తరహా శస్త్రచికిత్సలు పెద్దమొత్తంలోనూ నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు జనరల్ సర్జరీలు 454, గైనకాలజీలో 147, ఎస్‌సీయూలో చిన్నపిల్లలకు 294, జనరల్ పిడియాట్రిషియన్ లో 93, గుండెకు సంబంధించిన ని 316, చెవికి సంబంధించినవి 120, కంటి ఆపరేషన్లు 1096, జనరల్ మెడిసిన్ విభాగంలో 589, హిమోపిల్లా 54, చర్మసంబంధిత3, ఆర్థోపెడిక్ (పాలిట్రా మాలో) 483మందికి ఆపరేషన్లు నిర్వహిం చారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీకి ప్రత్యేకంగా వార్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు

ఎల్ కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్



జిల్లా జనరల్ ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. పేదలకు రూ. 3కోట్ల విలువైన లబ్ధి చేకూరింది. రోగులు వారి తరపు బంధువులు ఈ సేవ లను సద్వినియోగించుకోవాలి. ఆస్పత్రిలో అన్ని విభాగాల్లోనూ నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. సౌకర్యాలు, సదుపాయాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందాలంటే రోగులు కాస్త ఓపికతో ఉండాలి. తద్వారా మంచి సేవలు అందించడానికి వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా సర్కారు ఆస్పత్రులలో ఈ సేవలు పొందాలి.

పామాయిల్ సాగుతో ఆర్థికాభివృద్ధి

- అంతర పంటగా మునగ సాగుతో అదనపు ఆదాయం
- భద్రాద్రి జిల్లా ఉద్యానవనశాఖాధికారి కిషోర్

దమ్మపేట, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులు ఆర్థికంగా అభి వృద్ధి చెందవచ్చని జిల్లా ఉద్యానవనశాఖాధికారి జె.కిషోర్ తెలిపారు. పూసుకుంట గ్రామంలో ఉద్యావనవనశాఖ ఆధ్వర్యంలో బుధవారం కొండరెడ్లకు పామాయిల్ సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. నీటివసతి ఉన్న రైతులు పామాయిల్ సాగు చేసుకోవటం వల్ల లాభదాయకంగా ఉంటుందన్నారు. పామాయిల్ సాగు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుట్టుందని, జిల్లాలో పామాయిల్ సాగుకు భూములు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100శాతం రాయితీపై ప్రభుత్వమే డ్రిప్ అందజేస్తుందని, నాలుగు సంవత్సరాల పాటు పామాయిల్‌మొక్కలకు ఎరువుల యాజ మాన్యానికి ఎకరాకు రూ.4200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.16800 ప్రభుత్వం అందజే స్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర పంటలుగా కోకో, కూరగాయిలు, మునగ, తదితర పంటలు సాగుచేసుకోవచ్చ న్నారు. తోటల చుట్టూ సరిహద్దులో వెదు, శ్రీగంధం, టేకు, సరుగుడు తదితర చెట్లను పెంచుకోవట ద్వారా దీర్ఘకాలంతో అధికాదాయం పొందవచ్చన్నారు. పామాయిల్ సాగు చేయటం వల్ల రైతుల కుటుంభాలకు ఎంతో మేలు జరు గుందని పామాయిల్ సాగు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధి కారి బాలకృష్ణ, హెచ్‌వో సందీప్, ఏఈవో కేశవ్, ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికలు పూర్తి



బహుమతులు అందజేస్తున్న డీఈవో

కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి,డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): బుధవారం కొత్తగూడెం ఎంఆ ర్‌సీ ఆవరణలో జిల్లాస్థాయి జీవశాస్త్ర టాలెంట్ నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. తొలుత డీఈఓ వెంకటేశ్వరచారీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 23 మండలా లకు చెందిన పదోతరగతి విద్యార్థులు పాల్గొ న్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి 23మంది, తెలుగు మీడియం నుంచి 23మంది మొత్తం 46 మంది ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఏసీజీ భద్రాద్రి జిల్లా టీబీఎస్‌ఈ గౌరవ అధ్యక్షుడు ఎస్ మాధవరావు, శ్రీనివాసరావు, ఎంఈఓ ప్రభుదయాల్, ఏఎంఓ నాగరాజశేఖర్, డీఎస్ఓ చలపతిరాజు, కుమారీ లక్ష్మి, టీబీఎస్ ఎఫ్ ఫోరం సభ్యులు సిహెచ్. సునందిని, విజ యభాస్కర్, నారాయణరావు, సుధారాణి, మాధ వరావు, రాంప్రసాద్, లక్ష్మణ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. విజేతలు ఈనెల 28న రాష్ట్రస్థా యిలో నిర్వహించనున్న ఆన్లైన్ పోటీల్లో పాల్గొం టారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇంగ్లీష్ మీడి యంలో ప్రథమ బహుమతి వి.విశాల్ (జెడ్పీహె చ్ఎస్, అశ్వాపురం), ద్వితీయ బహుమతి ఎన్. గీతా (జీహెచ్ఎస్, టేకులపల్లి) ఎంపికయ్యారు. అలాగే తెలుగు మీడియంలో ప్రథమ బహుమతి పి. స్వరూప (జడ్పీహెచ్ఎస్ చిన్నమిడిసిలేరు, చర్ల మండలం), ద్వితీయ బహుమతి ఎండి. సోయా ముస్కాన్ (జీహెచ్ఎస్, మేదరబస్తీ కొత్తగూడెం) విద్యార్థులు ఎంపికయ్యారు.

ఖమ్మం జిల్లా నుంచి నలుగురు

ఖమ్మంఖానాపురంహవేలి: తెలంగాణ బాలా జికల్ సైన్స్ ఫోరం (జీవశాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ ప్రతిభ పాటల పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం నుంచి ఇద్దరు తెలుగు మీడియం నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికైనట్లు సైన్స్ అధికారి తెలిపారు. ఇంగ్లిష్ మీడియం నుంచి పి.వెన్నెల, జడ్పీహెచ్ ఎస్ జలగంనగర్ ప్రథమ స్థానం, సీహెచ్ భవ్యశ్రీ, జడ్పీహెచ్ఎస్ వేంసూరు ద్వితీయ స్థానం, తెలుగు మీడియం నుంచి జాషువా జడ్పీహెచ్ఎస్ కాకర్లపల్లి ప్రథమ స్థానం, కె.వెం కట శివతేజ, చిరునోముల ద్వితీయ స్థానం సాధించారు.

నేటినుంచి గురుకుల విద్యాలయాల
రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

పాల్వంచ గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు, ఏడుజోన్ల నుంచి 2వేలమంది క్రీడాకారుల హాజరు

పాల్వంచరూరల్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యా లయాల సంస్థల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గురువారం ప్రారంభమవుతున్నాయి. బుధ వారం స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్టీ జోన్ జోనల్ ఆఫీసర్ కాంపాటి అలివేలు ఈ వివరాలు వెల్లడించారు. క్రీడల బ్రోచ్‌ను ఆవి ష్కరించారు. రాష్ట్రంలోని 7జోన్ల నుంచి వచ్చే 2వేలమంది క్రీడాకారులు పీఈటీ, పీడీలకు వసతులు కల్పించినట్లు తెలిపారు. మూడు రోజులు ఈ క్రీడాపోటీల్లో పాల్గొనే వారి కోసం 15 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని విన్నవించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొన నున్నారని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జోన్ జోనల్ అధికారిని కొప్పుల స్వరూపరాణి, రాజన్న సిరిసిల్ల జోన్‌జో నల్ అధికారిని కొత్తపల్లి ప్రత్యూష, పాల్వంచ గురుకుల ప్రిన్సిపాల్ పీవీఎన్. పాపారావు, సీని యర్ ప్రిన్సిపల్ డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, స్టేట్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ ఇంచార్జీ సట్ల శంకర్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్స్ కే. వాసు, జి.శ్రీనివాస్, ఐనాల సైదులు పాల్గొన్నారు.

మనోవేదనతో వృద్ధురాలి మృతి

కామేపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భర్త మృతి తట్టుకోలేక నాలుగు నెలలు మంచానికే పరిమితమై ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కామే పల్లి మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన కొమ్మినబోయిన నాగయ్య, కోటమ్మ (67) వృద్ధ దంపతులు ఉన్నారు. తాళ్ల గూడెం గ్రామంలో కామేపల్లి రెవెన్యూలో భూమి 2017 నుంచి కోర్టు వివాదంలో చిక్కుకుంది. ఈ క్రమంలో భూమి తనకు వస్తుందో రాదోనని మనోవేదనకు గురై ఈ ఏడాది ఆగస్ట్15న నాగయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఒకవైపు భర్త మృతి, మరో వైపు భూమి అయిన వస్తుందానని మనోవే దన చెంది బుధవారం భార్య మృతి చెందింది. దీనిపై విచారణ జరపాలని స్థాని కులు డిమాండ్ చేశారు.

దొంగల ముఠా అరెస్టు

తిరుమలాయపాలెం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగత నాలకు పాల్పడుతున్న ముఠాను తిరుమలాయపాలెం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపం లోని ఎయిర్‌టెల్ టవర్ ట్రాన్సుఫారం పగులగొట్టి వాటిలోని పాత ఇనుము, కాపర్‌వైరును దొంగిలించేందుకు ప్రయత్నించారు. ఇది విఫలమై ఆటోలో పారిపోయేందుకు ప్రయత్నించారు. సీసీ పుటేజీ ఆధారంగా ఎస్ఐ కూసు పుడి జగదీష్ ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. అనుమానితు లైన వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు మహిళలను విచారించగా నేరం ఒప్పుకున్నారు.నిందితులైన చిరుపాటి యల్లమ్మ, తూర్పాటి లక్ష్మి, తూర్పాటి సునీతతో పాటు ఆటోడ్రైవర్ సరికిటి యల్లయ్యస్వామి, వరంగల్‌జిల్లా లేబర్ కాలనీకి చెందిన వారుగా గుర్తించారు. కూసుమంచి మండలంలో ఓ ట్రాన్సుఫార్మర్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇక్కడ దొంగిలించిన సొత్తును వరంగల్‌లో అమ్ముకుంటున్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

జూలూరుపాడు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు కుటుం బ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధ వారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలం బచ్చోడు గ్రామానికి చెందిన భూక్య భద్రు (50), భార్య లక్ష్మి, కుమారుడు కళ్యాణ్ కొంతకాలంగా గుండ్లరేవు గ్రామంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భద్రు ఇటీవల మద్యా నికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు కుటుంబసభ్యులు డబ్బులు ఇవ్వ డానికి నిరాకరించడంతో చనిపోతానని బెదిరిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16న మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని భార్య, కుమారుడ్ని అడిగాడు. లేవని చెప్పి వారు కూలీ పనులకు వెళ్లారు. మనస్థాపం చెంది ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అయన్ని కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బూర్గంపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం సంజీవరెడ్డి పాలెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం...మండల కేంద్రమైన బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని గౌతపురానికి చెందిన మారబోయిన రమేష్(50) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగ ళవారం రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రమేష్ తిరిగి రాలేదు. బుధవారం సంజీవరెడ్డిపాలెం గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి ఉన్న మృతుడిని గమనించిన స్థానికులు బాధిత కుటుం బసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలు సుకున్న పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐలు రాజేష్, నాగభిక్షం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు తలకు తీవ్రగాయాలతో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తల్లీ బిడ్డల ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి డబ్ల్యూఎల్ రేగుబల్లికాలనీకి చెందిన ఓ తల్లి తన ఇద్దరు చిన్నారుల తో కలిసి బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. ఒక పాపకు మూడేళ్ల కాగా, మరో నెలల పాప తో కలిసి ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరూ లేని సమయంలో ఈ దారుణానికి ఒడికట్టింది. తాను క్రిమిసంహారక మందు తాగడంతో పాటు ఇద్దరు పిల్లలకూ తాగించింది. ఈ విషయాన్ని క్షతగాత్రురాలు మణుగూరు మండలం రామానుజారంలోని తన కుటుంబ సభ్యుల కు ఫోనులో తెలపడంతో విషయం వెలుగు చూసింది. వారు ఇరుగు పొరుగు వాళ్ల వెంటనే స్పందించి వారిని నరసాపురం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తర లించారు. చిన్నపిల్లల ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులు, మరో ప్రైవేటు ఆసుపత్రిలో తల్లి చికిత్సలు పొందుతోంది. 24 గంటలు గడిస్తే తప్ప ఆరోగ్య పరిస్థితి ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపినట్లు సమాచారం. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

932 కేజీల మొక్కజొన్న విత్తనాల పట్టివేత

ఏన్కూరు, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో అక్రమంగా నిల్వ ఉంచిన 932 కేజీల మొక్కజొన్న విత్తనాలను బుధవారం పోలీ సులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఏన్కూరు ప్రధాన రోడ్డులో గల ఓ ఇంటిలో అక్రమంగా మొక్కజొన్న విత్తనాలు నిల్వ చేశారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిం చారు. తనిఖీల్లో ఆడ, మగ విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకు న్నారు. స్టాక్ పాయింట్ పర్మిషన్ లేకుండా అక్రమంగా నిలవ చేసి, విత్తనాలు విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఏవో నర సింహారావు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.6లక్షలు ఉంటుం దని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఏవో నర సింహారావు, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, కానిస్టేబుల్ శంకర్, ఏఈ వోలు బాలకృష్ణ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై డీఎస్పీ విచారణ

ఆళ్లపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై డీఎస్పీ చంద్రభాను బుధవారం విచారణ చేపట్టారు. వివరాల ప్రకారం..మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పరమ రమేష్(మేషక్)(35)చిట్టీపాట నిర్వహకుడి వేధింపులు తాళలేక డిసెంబరు 11న క్రిమిసంహారక మందు తాగా డు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొం దుతూ డిసెంబరు 16న మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో చిట్టీడబ్బుల విషయంలో వేధించిన వ్యక్తిపై మృతుడి భార్య మౌనిక, కుటుంబ సభ్యులు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రతీష్, జిల్లా పోలీస్ అధికారుల సూచనల మేరకు సదరు చిట్టీపాట నిర్వాహకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డిఎస్పీ చంద్రభాను మృతుడి ఆత్మహత్యకు గల కారణాలపై వివరాలు సేకరించారు.

నాసిరకంగా చెక్‌డ్యాంల నిర్మాణాలు

- రైతులకు అక్కరకురాని పొట్లపల్లి, గోవిందాపురం చెక్‌డ్యాంలు
- రివిట్‌మెంట్ వాల్ కట్టకపోవడంతో భూములకు కోత
- కానరాని అధికారుల పర్యవేక్షణ



కొట్టుకుపోయిన పొట్లపల్లి చెక్‌డ్యాం(ఫైల్)

పినపాక, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపల్లి గ్రామం వద్ద పెద్దవా గుపై రూ.7.5 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం పలు సాంకేతిక లోపాల కారణంగా అక్కరకురా కుండా పోతోంది. ఇష్టారాజ్యంగా చేపట్టిన నిర్మా ణాలతో రైతులకు మేలు జరగకపోవడమే కాకుండా, రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం చేయక పోవడంతో పెద్దవాగు ఉధృతికి భూములు కోతకు గురవుతున్నాయి. అంతేగాక కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన చెక్‌డ్యాంల వల్ల సాగుభూములకు నీళ్ల అందే పరిస్థితి కూడా లేదని, వానాకాలంలో చెక్ డ్యాంల కార ణంగా రైతుల పంటలు మునుగుతున్నాయని, భూములు కోతకు గురవుతున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వం డి జనరేషన్ ఆఫ్ వాటర్ స్కీమ్‌లో భాగంగా 2020లో నీటి ప్రవాహం ఉన్న పెద్దవాగుపై చెక్ డ్యాంలు నిర్మించింది. భూగర్భ జలాలను కాపాడుతూ, నీటి నిల్వలను పెంచడం ద్వారా, రైతులకు సాగునీరు అందించేందుకు చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టినట్లు ఇరిగేషన్ అధికా రులు చెబుతున్నారు.

పొట్లపల్లి వద్ద రూ.7.5 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం నాసిరకంగా నిర్మించడంతో పెద్దవాగు వరదలకు కొట్టుకుపోయింది. పొట్లపల్లి పంచా యతీ లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సేకరణ డంప్ షెడ్డు, స్మశానవాటిక కూడా వరద ఉధృ తికి సగానికి పైగా కొట్టుకుపోయాయి.

ఈ చెక్ డ్యాం నిర్మాణానికి అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించినా, రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగానే ముందు అను కున్న చోటును మార్చి ఇక్కడ నిర్మాణం చేప ట్టారని బాధిత రైతులు చెబుతున్నారు.

పినపాక కరకగూడెం మండలాల సరిహ ద్దులో పెద్దవాగుపై గోవిందాపురం, ఎల్లాపురం, బంగారుగూడెం గ్రామాల వద్ద రూ.12.5 కోట్లతో చెక్‌డ్యాం నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ఏదైతే సాగునీరు అందించడం ద్వారా రైతు లను ఆదుకోవాలని ఆలోచిస్తుందో ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుతో అదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఇష్టారాజ్యంగా చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణంతో పెద్దవాగు వరదల కారణంగా భూములు కోతకు గురవు తున్నాయని, ఇరిగేషన్ శాఖాధికారులు మొదట అనుకున్న చోట కాకుండా మరో చోట నిర్మాణాలు జరపడం వల్ల సాగునీరందించే లక్ష్యం దెబ్బతింటోందని బాధిత రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యాంలకు లేని రివిట్‌మెంట్ గైడ్‌వాల్

పెద్దవాగుపై పొట్లపల్లి వద్ద చెక్‌డ్యాం పూర్తి చేసి చేతులు దులుపుకున్న ఇరిగేషన్ శాఖాధికారులు, రివిట్‌మెంట్ గైడ్ వాల్ చేప ట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం లేకుండా పోతోందని రైతులు అంటున్నారు. ఫలితంగా ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములు వానాకాలంలో పెద్దవాగు వరద ఉధృతి కారణంగా కోతకు గురవుతోందని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు పూర్తి స్థాయిలో ప్రణాళికా బద్ధంగా నిర్మాణం చేయాలని, అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పటిష్టంగా బొగ్గు గనుల్లో రక్షణ చర్యలు

- కేంద్ర బొగ్గుశాఖ మంత్రి, కిషన్ రెడ్డి

ఇల్లెందు, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) :దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో రక్షణ చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని కేంద్ర బొగ్గుశాఖ మంత్రి కిషన్ రెడ్డి కోరారు. దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమల 49వ రక్షణ విభాగం స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఢిల్లీలో మంగళ, బుధ వారాల్లో జరిగాయి. సమావేశంలో బీఎం ఎస్ బొగ్గు పరిశ్రమ ఇన్‌చార్జి, సేఫ్టీ స్టాండింగ్ కమిటీ సభ్యులు కొత్తకాపు లక్ష్మా రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ బొగ్గు పరిశ్రమ కార్యదర్శి విక్రమ్ దేవదత్, కోల్ ఇండియా చైర్మన్ ప్రసాద్, సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్, ఉత్పాదక సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. రెండు సంవత్సరాల తరువాత నిర్వహించిన బొగ్గు పరిశ్రమ రక్షణ విభాగం స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు బీఎంఎస్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కే. లక్ష్మా రెడ్డి ఢిల్లీ నుంచి ఫోన్ ద్వారా ఆంధ్రజ్యోతికి తెలిపారు.

భూసేకరణ ప్రక్రియ వేగిరం చేయాలి

- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, డిశం బరు18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్ట్‌లకు భూసేకరణ పనులను వేగిరం చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో వివిధ ప్రాజెక్టు భూసేకరణ పురోగతిపై కలెక్టర్ స మీక్షించారు. నేషనల్ హైవే 365 బీజీ ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్‌కు ప్యాకే జి-1,2,3లకు సంబంధించి 1358.1650 ఎకరాల భూసేకరణకు గాను 1292.1825 ఎకరాలకు అవార్డ్ పూర్తి చేసినట్లు, నేషనల్ హైవే ద్వారా రూ. 362.17 కోట్లు పరిహారాన్ని డిపాజిట్ చేసి నట్లు ఆయన తెలిపారు. రూ. 355.85 కోట్ల నష్టపరిహారం రైతుల ఖాతాలకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టుల వారీగా చేయాల్సిన భూసేకరణ, పూర్తి చేసింది, చేయాల్సింది కోర్టు కేసులో ఉన్న అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం, ఏన్కూరు లింక్ కాల్వ మిగులు భూసేకరణపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనుల భూసేకరణకు రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, నేషనల్ హైవే పీడీ రామాంజనేయరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, నీటిపారుదల శాఖ, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

11 పంచాయతీలకు ప్రతిపాదనలు

- 20 లోగా ప్రభుత్వానికి నివేదికలు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి) : ఖమ్మం జిల్లాలో కొత్తగా 11 గ్రామ పంచాయతీలు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాకు చెం దిన మంత్రులు ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారులు వాటికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ నెల 20వ తేదీలోగా ప్రభుత్వా నికి పంపించనున్నట్లు తెలిసింది. జిల్లాలో పాలేరు నియోజకవర్గంలో 10పంచాయతీ లకు, కామేపల్లి మండలంలో ఒకటి, సింగ రేణి మండలంలో ఒక గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు.

ప్రతిపాదనలు ఇవే ...

తిరుమలాయపాలెం మండలంలో బీరో లు పంచాయతీ నుంచి విడదీసి బంధంపల్లి, లక్ష్మీదేవిపల్లి నుంచి జల్లుతండా, ఖమ్మం రూరల్ మండలంలో పొలిశెట్టిగూడెం పం చాయతీ నుంచి మద్దివారిగూడెం, కొండా పురం నుంచి సీతారాంపురం, తనగంపాడు నుంచిచి గుండాలతండా, కాచిరాజుగూడెం నుంచి వాల్యాతండా, కూసుమంచి మండ లంలో ఎర్రగడ్డతండా నుంచి దుబ్బతండా, గైగొళ్లపల్లిని నుంచి ఉడతలతండా, జీళ్ల చెర్వు నుంచి గోపాలరావుపేట, జుజ్జులరావు పేట నుంచి గుర్వాయిగూడెం గ్రామ పంచా యతీలను ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కామేపల్లి మండలంలో గోవింద్రాల పంచాయతీలోని గోవింద్రాల బంజర, సింగ రేణి మండలంలో భాగ్యనగర్ తండా గ్రామ పం చాయతీ నుంచి సామ్యాతండాగా కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయనున్నారు.

ప్రతిపాదనలను 20లోగా పంపిస్తాం

● ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

కొత్త పంచాయతీల కోసం ప్రతిపాద నలు సిద్ధం చేశాం. 20లోగా వీటిని ప్రభు త్వానికి నివేదించనున్నాం. అయితే వీటిపై ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉం టుంది. పరిపాలన పరమైన, జనాభా ప్రాతి పదికన వీటిని ఏర్పాటు చేస్తారా అనే విష యాలపై స్పష్టత రావాల్సి ఉంది.

20న జాబ్ మేళా

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం అయిన హెటరో నెక్సిటీ, ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ లో ఉద్యోగాలు భర్తీ చే సేందుకు ఈ నెల 20న మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వ హిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8121040350, 9966077622 నెంబర్‌ను సంప్రదిం చాలని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎటు వంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తు న్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సువర్ణాపురం క్రాస్‌రోడ్డు వద్ద సీఐ మురళీ ఆదేశాల మేరకు ఎస్ఐ నరేష్ వా హనాలు తనిఖీ చేస్తుండగా గంధసిరి మున్నేరు నుం చి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మురళీ మాట్లాడుతూ ఏడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సీపీఐ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయండి

ఖమ్మంటౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ ఆవిర్భావసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కోరారు. బుధవారం జిల్లా సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్‌భవన్‌లో యర్రా బాబు అధ్యక్షతన జరిగిన సీపీఐ ప్రజాసంఘాల సంయుక్త సమావేశంలో దండి సురేష్ మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ బాగం హేమంతరావు, ప్రజాసంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, మహమ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వేంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పడగాల మల్లేష్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	64
పచ్చిమిర్చి	34
కాకరకాయ	48
బెండకాయ	40
పొట్లకాయ	50
దోసకాయ	28-48
చిక్కుడు	48
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	24
దొండ	56-60
సొరకాయ	26
క్యారెట్	46
క్యాప్సికం	64
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

అర్హులను గుర్తించేందుకు సర్వే

- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా వివరాల సేకరణ
- కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మంజూరులో అర్హులను గుర్తించేందుకే సర్వే జరుపుతున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పేర్కొన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని సర్వే బృందాలకు సూచించారు. నిరుపేదల నివాసాలను సర్వే చేసే సమయంలో వారి ఆర్థిక స్తోమతను పరిశీలించి సిఫారసు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీవో ద్రౌపతి, సర్వే బృందాలతో కమిషనర్ అభిషేక్ మాట్లాడుతూ ఇందిరమ్మ యాప్‌లో ఇబ్బందులు, సర్వే సందర్భంగా ప్రజల సహకారం ఎలా ఉందని, ప్రజలు అడిగిన డాక్యుమెంట్స్ ఇస్తున్నారా అని ప్రశ్నించి తెలుసుకున్నారు.



సర్వే యాప్‌పై మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

అంబేద్కర్ కాలేజీలో పరిశీలన

ఖమ్మం నగరంలోని ఎస్సీ గురుకులాల అంబేద్కర్ కాలేజీని కమిషనర్ అభిషేక్ పరిశీలించారు. విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు తీసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

'చలో అసెంబ్లీ' ముట్టడిని విజయవంతం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు జరిగే అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని మాలమహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కలెక్టరేట్‌లోని పలు సెక్షన్ల తనిఖీ

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందే విధంగా ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టరేట్ లో భోజనశాల, ముఖ్య ప్రణాళికఅధికారి, రెవెన్యూ విభాగాలు, హౌసింగ్ సెక్షన్, లేడీస్ లాంజ్, స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ తనిఖీ చేశారు. వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపిగ్గా విని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. విధులకు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని సూచించారు.

ఇందిర మహిళా డెయిరీపై..

పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇందిర మహిళా డెయిరీ, హాస్టళ్లలో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఇందిరా మహిళా డెయిరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు 250 లబ్ధిదారుల ఎంపిక, వివిధ అంశాల్లో అధికారులు బాగా పని చేశారని కలెక్టర్ అభినందించారు. పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ కు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చలికాలం నేపథ్యంలో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా చూడాలని, దోమ తెరలు, చలికాలంలో విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, బ్లాంకెట్స్ అందుబాటులో ఉంచాలని, స్నానానికి వేడి నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, డీఎస్‌సీడీవో. కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అడిషనల్ డిఆర్డీవో నూరుద్దీన్, మిషన్ భగిరథ డీఈ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వివిధ విభాగాల్లో ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

ఇళ్ల సర్వేలో హామాలీ కార్మికులను గుర్తించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్లసర్వేలో హామాలీ కార్మికుల కుటుంబాలను ప్రత్యేకంగా గుర్తించాలని టీయూసీఐ హామాలీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ వెంకన్న కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో హామాలీ కార్మికుల సమస్యలపై చర్చించారు. నిత్యవసరాల ధరలు పెరుగుతున్నాయని, కూలీ ధరలు మాత్రం పెరగటం లేదని వాపోయారు. నాయకులు పుల్లారావు, కే శ్రీనివాస్, బొమ్మకంటి రమేశ్, శ్రీను, తిరుపయ్య, శోభన్, యం నాగేశ్వరరావు, వీ సత్యం, సీతయ్య పాల్గొన్నారు.

రాజగోపాలరెడ్డి వ్యాఖ్యలపై నిరసన

- జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతల ఆందోళన

ఖమ్మంమామిళ్లగూడెం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్ తొలగించాలన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీరుపై టీడీపీ నాయకులు ఎన్టీఆర్ అభిమానులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్ స్థానంలో నూతన అసెంబ్లీ నిర్మాణం చేయాలనే వ్యాఖ్యలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కేతినేని హరీష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఖమ్మంలో నల్లరిబ్బన్ లు కట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిరసన కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు మందడపు సుధాకర్ మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఉన్న ఎన్టీఆర్ పట్ల కోమటిరెడ్డి అహంకార పూరితంగా వ్యాఖ్యలు చేయడం హేయనీయమన్నారు. రాజకీయ చైతన్యంతో దేశ రాజకీయాల్లో సంకీర్ణ రాజకీయాలకు బాటలు వేసి తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలు పెంచిన ఎన్టీఆర్ పేదలు బడుగు బలహీనవర్గాలకు అన్నలా మారి సంక్షేమ కార్యక్రమాలకు బాటలు వేశారని అన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ చరిత్ర చెరిపేసేలా రాజగోపాలరెడ్డి తన అహంకార వ్యాఖ్యలు ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్టీఆర్ గౌరవానికి భంగం కలిగించే పనులు చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోతారపు సుధాకర్, మీగడ రామారావు, కన్నేటి వృద్ధి, కూచిపూడి జై, నాగండ్ల లక్ష్మణ్, చింత నిప్పు నాగేశ్వరావు, తాళ్లూరి నారాయణరావు, బోడేపూడి రవి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకులూ.. నోరు అదుపులో ఉంచుకోండి...

నేలకొండపల్లి:కాంగ్రెస్‌నాయకులు నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడాలని టీడీపీ నాయకుడు కొండబాల కరుణాకర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్య పట్ల తెలుగుదేశం శ్రేణులు భగ్గుమన్నాయి. బుధవారం నేలకొండపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొండబాల మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తెలుగుదేశం మద్దతివ్వబట్టే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకుని మసులుకోవాలన్నారు. సమావేశంలో ఆరెకట్ల కొండలరావు, వీసం శ్రీనివాసరావు, అక్కినేని నాగేశ్వరరావు, నలమాస మల్లయ్య, కోలేటి మస్తాన్‌రావు,తాటికొండనాగేశ్వరరావు, బండారు రాంబాబు, వంకాయలపాటి పద్మ పాల్గొన్నారు.





ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, మాట్లాడుతున్న కొండబాల కరుణాకర్

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఖమ్మంవ్యవసాయం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): నగరంలోని 46వ డివిజన్ జూబ్లీ క్లబ్ ప్రాంతానికి చెందిన బానోతు కోమలి ఇటీవల తీవ్రఅస్వస్థతకు గురై మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో నగర కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్ రూ.5000 అందజేశారు. వారి కుటుంబం గతంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండేవారన్నారు. అలాంటివారికి ఈ సమయం లో అండగా ఉండాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

జమిలి విధానం రాజ్యాంగాన్ని కించపరచడమే

తిరుమలాయపాలెం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికలు భారత రాజ్యాంగాన్ని కించపరచడమేనని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో ఆ పార్టీ సమావేశంలో మాట్లాడారు.

ప్రభుత్వ కళాశాలల్లో టోల్‌ఫ్రీ నెంబర్లు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో టెలిమానస టోల్‌ఫ్రీ నెంబరు 14416, యాంటీ డ్రగ్స్ టోల్‌ఫ్రీ నెంబరు 1908ను కళాశాల ఆవరణలో తప్పని సరిగా ప్రదర్శించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. బుధవారం నగరంలోని నూతన కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీశనివారం మధ్యాహ్నం క్రీడలు, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించాలని, ఒత్తిడికి గురవుతన్న విద్యార్థులను గుర్తించి మానసిక వైద్యులకు చూపించాలని అన్నారు. కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని, ప్రతీ కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ కళావతిబాయి,యాంటీ డ్రగ్స్ సీఐ రాము, గురుకుల ఆర్‌సీఓలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

జోరుగా న్యాయవాద సంఘం ఎన్నికల ప్రచారం

ఖమ్మంలీగల్,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే ఖమ్మం న్యాయవాదసంఘ ఎన్నికలకు ప్రచారం రసవత్తరంగా మారింది. పోటీలో ఉన్న అభ్యర్థులు మునుపెన్నడులేని విధంగా మూడు నెలల ముందే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఓటు వేయమని అభ్యర్థిస్తున్నారు. ఎన్నడూలేని విధంగా ప్రతీ పదవికీ చాలామంది పోటీ పడుతున్నారు. ఈసారి ఎన్నికల్లో మహిళా న్యాయవాదులు సైతం పోటీకి సై అంటున్నారు.

ఖమ్మంలో మార్చిలో ఎన్నికలు

పోటీలో ఉన్నామని ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. సుమారు వెయ్యిమంది న్యాయవాదులు ఓటర్లుగా ఉన్నారు. పోటీచేసే అభ్యర్థులు ప్రతీ ఒక్కరినీ కలవడంకోసం ప్రయత్నిస్తున్నారు. వాట్సాప్ ద్వారా మరియు మెసేజ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అధ్యక్ష పదవికి తొండపు వెంకటేశ్వరరావు, సుగ్గల వెంకటేశ్వరగుప్తా ప్రచారం చేసుకుంటున్నారు. మరో ఇద్దరు అభ్యర్థులు తమ సహచరులతో సమాలోచనలు చేస్తున్నారు. ఉపాధ్యక్ష పదవికి ఎస్‌కె.జానిమియా, మోతుకూరి విజయశాంత మరియు మల్లెం రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి పదవికి తెల్లాకుల రమేష్ బాబు, గద్దల దిలీప్, గంథ్రాలయ కార్యదర్శిగా దేవరకొండ కళ్లాణి, సింగారపు రాంబాబు, క్రీడల కార్యదర్శిగా కేవీవీలక్ష్మీ, ధారావత్ రాందాస్‌నాయక్, జాయింట్ సెక్రటరీగా మేకల నవీన్, ట్రెజరర్‌గా పొన్నెకంటి నరసింహారావు ప్రచారం చేసుకుంటున్నారు. పోటీచేసే అభ్యర్థులు న్యాయవాదుల సమస్యలపట్ల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇస్తున్నారు.

గడువులోగా సీఎంఆర్ పంపిణీ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): గడువులోగా సీఎంఆర్ ధాన్యం డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లాలోని మిల్లర్లు, రెవిన్యూ, సంబంధిత అధికారులతో సీఎంఆర్ బియ్యం పంపిణీపై సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో 2023-24 వానాకాలం పంట కింద 80వేల 903 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీకు గాను 69 వేల 592 మెట్రిక్ టన్నుల రైస్, యాసంగి పంటకు సంబంధించి 14 వేల 757 మెట్రిక్ టన్నుల ధాన్యం డెలివరీకు గాను 7 వేల 743 మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ చేసినట్లు తెలిపారు. వానాకాలం, యాసంగి కలిపి జిల్లాలోని రైస్‌మిల్లర్లు మరో 18 వేల 324 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరి చేయాల్సి ఉందన్నారు. వీటిని ప్రభుత్వ గడువులోగా అందించాలన్నారు. నాణ్యత లేని ధాన్యం ఉంటే రైస్ మిల్లులు తీసుకోవద్దని, అంతే తప్ప ఏలాంటి కోతలు విధించడానికి వీలు లేదన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఖమ్మం జిల్లాలో నాణ్యమైన రైస్ పండుతుందని, ధాన్యం తూర్పార పట్టాల్సిన అవసరం ఉంటే తప్పనిసరిగా చేస్తామని, తూర్పార పట్టకుండా రైస్ మిల్లులకు ధాన్యం తరలిస్తున్న కొనుగోలు కేంద్రాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, మిల్లర్లు, డిప్యూటీతహసీల్దార్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్

ఖమ్మంక్రైం,డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆటోలు చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మరిపెడ మండలం, చిల్లంచర్ల గ్రామానికి చెందిన మధు తన ఆటోలో రోగులను ఎక్కించుకుని నగరంలోని ఓ ఆసుపత్రికి వచ్చాడు. తన ఆటోను ఆసుపత్రి సమీపంలో పార్కింగ్ చేశాడు. ఆసుపత్రికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్థుడైన గోసుల వెంకన్నగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీచైతన్యలో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ప్రాంగణం పొన్నెకల్లులో కల్చరల్ ఫెస్టును ప్రారంభించారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలల రెండు రోజుల సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఈ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య ప్రారంభించారు. ముఖ్య అతిథి శ్రీరామ్ జలదుర్గం హాజరయ్యారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి తమ లక్ష్యాలను సులభంగా సాధించే మార్గాలను తెలిపారు. ఈకార్యక్రమంలో డీజీఎం చేతన్ మాధుర్, ఎగ్జిక్యూటివ్‌డీన్ వర్మ ఏజీఎంలు సి.హెచ్.బ్రహ్మం, జి.గోపాలక్రిష్ణ, జి. ప్రకాష్ , జోనల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వల చేస్తున్న శ్రీధర్

క్లినికల్ అప్రెంటీస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎంపీహెచ్ డబ్ల్యూ(ఫిమేల్) ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఏడాది క్లినికల్ షిప్ శిక్షణ సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రుల్లో అందించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారు వారు వెయ్యి రూపాయలు డీడీ రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చనని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 23 లోగా అందజేయాలని తెలిపారు.

సంక్షేమ గురుకులాలను, హాస్టళ్లను ప్రక్షాళన చేయాలి

సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం

ఖమ్మంటౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకులాలను, హాస్టళ్లను ప్రక్షాళన చేయాలని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీసీ గురుకల విద్యార్థిని లక్ష్మిభవాని కీర్తిని బాగం హేమంతరావు ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వేంకటేశ్వర్లు, ఏనుగు వేంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సమాఖ్య పనితీరు ఆదర్శం

- ఏడాదిలో రూ.16 లక్షల వార్షిక ఆదాయం
- మెప్మా పీడీ మహేందర్, కార్పొరేటర్ శీలంశెట్టి

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 25మహిళా స్వయం సహాయక సంఘాలతో 250మంది సభ్యులతో నూరు శాతం రుణాల రికవరీతో సాధించిన గాంధీ సమాఖ్య పనితీరు ఆదర్శమని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్, స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలో గాంధీ సమాఖ్య వార్షికోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఏడాది కాలంలో చేపట్టిన ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఏడాదిలో ఆడిట్ నివేదికలను వివరించారు. గాంధీ సమైఖ్యకు రూ.16లక్షల వార్షిక ఆదాయం పెరిగినట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈసీ సభ్యులు, ఓబీ సభ్యులు క్రమశిక్షణతో సమావేశాలు జరుపుకొని క్రమశిక్షణతో పని చేయటంతో ఇటువంటి మంచి ఫలితాలు వచ్చాయని అభినందించారు. సీవో ద్రౌపతి, ఆర్పీ శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ మహేందర్

విధులకు సక్రమంగా హాజరు కావాలి

- జిల్లా వైద్యాధికారి కళావతిబాయి
- మంచుకొండ పీహెచ్‌సీ వైద్యులకు హెచ్చరికలు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ సేవలు ప్రజలకు సక్రమంగా సమర్థంగా అందించేందుకు సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి ఆదేశించారు. మంచుకొండ పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పర్యటన సందర్భంగా పరిశీలించిన అంశాలు, లోపాలపై మండల వైద్యాధికారి శ్రీదేవి, వైద్యులు శ్రీధర్, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ రమాదేవికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎవ్వరి విధులు వారే నిర్వహించాలని ఆదేశించారు. నూరుశాతం జాతీయ వైద్య కార్యక్రమాలు అమలు జరపాలని సూచించారు. ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బందిని క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన స్థానంలోనే విధులు నిర్వహించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విధులు కేటాయించే ప్రాంతంలో ఉండాలని చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్ వెంటున్నారు.

మారని తీరు

వరసగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా వైద్యాధికారికళావతిబాయి మంచుకొండ పీహెచ్‌సీని తనిఖీలు చేస్తున్నా అధికారుల తీరు మాత్రం మారటం లేదు. గ్రామస్థాయిలోని ఆరోగ్య ఉపకేంద్రాలస్థాయిలో ప్రజలకు నేరుగా ఇంటింటి వైద్యసేవలు అందించాల్సిన ఏఎన్ఎంలను స్టాఫ్ నర్స్ విధులకు,హెల్త్ అసిస్టెంట్లను ఔషధవిధులకు పీహెచ్‌సీలో విధులు కేటాయిస్తున్నారు.బుధవారం సైతం హెల్త్ అసిస్టెంట్ కృష్ణయ్యకు ఔషధ విధులు నిర్వహించటం పీహెచ్‌సీ పనితీరును తెలుపుతోంది.

ఉచిత కుట్టు మిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మహిళా శక్తి పథకం క్రింద మైనారిటీ మహిళలకు అందించనున్న ఉచిత కుట్టు మిషన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కె.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలకు చెందిన మైనారిటీ మహిళలు ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు పేర్కొనబడిన ధృవ పత్రాలను జతచేసి కలెక్టర్ భవన సముదాయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయములో అందించాలని, ఇతర వివరాలకు 9704003002ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి తెలిపారు.

అట్టహాసంగా సీపీఎం 22వ జిల్లా మహాసభలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) 22వ ఖమ్మం జిల్లా మహాసభల సందర్భంగా సత్తుపల్లి పట్టణం ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. మహాసభల సందర్భంగా స్థానిక రావీ వీరవెంకయ్య భవనం (సీపీఎం ప్రాంతీయ కార్యాలయం) నుంచి వేలాది మందితో ర్యాలీ ప్రారంభమైంది. కోలాట నృత్యాలు, డప్పువాయిద్యాల నడుమ అరుణవర్ణ పతకాలు చేతబూనిన సీపీఎం కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా సాగారు. సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంలు ప్రజలకు అభివాదం చేస్తూ సభాప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం సీపీఎం జెండాను మాజీ డివిజన్ కార్యదర్శి తాతా భాస్కరరావు ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయిబాబు, టీ.వెంకట్, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, సోమయ్య, బుగ్గవీటి సరళ, బండి రమేష్, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, శోభన్, పీ.నాగరాజు, వై.విక్రమ్, కల్యాణం వెంకటేశ్వరరావు, మోరంపూడి పాండు, రావుల రాజబాబు, జాజిరి శ్రీనివాసరావు, కొలికపోగు సర్వేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహాసభలకు హాజరైన ప్రతినిధులు



సత్తుపల్లిలో భారీర్యాలీలో పాల్గొన్న మహిళలు

టీడీపీ బలోపేతానికి యువత ముందుకు రావాలి

» జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం



సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

బోనకల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతం చేసేందుకు యువత ముందుకు రావాలని ఆ పార్టీ జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం సూచించారు. స్థానిక సాయి బాబా కల్యాణ మండపంలో బుధవారం తెలుగు యువత జిల్లా నాయకుడు బాగం రాకేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంటరీ స్థాయి తెలుగు యువత సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సభ్యత్వాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అనూహ్యంగా అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా స్థాపించిన పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని కోరారు. గ్రామాలలోని యువత రాజకీయ ప్రవేశం చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకుడు పొగాకు జయరాం, రావుట్ల సత్యనారాయణ, బాగం రమేష్, నున్నా తాజుద్దీన్, యలమంచిలీ శివ, తుళ్లూరి కొండలరావు, మామిళ్ల నర్సింహ రావు, మైనేని రవి కుమార్, మరీదు బరకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల సభను జయప్రదం చేయండి

తల్లాడ, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈనెల 26న జరిగే సీపీఐ నూరు వసంతాల సభను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా నాయకుడు మద్దోజు శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం తల్లాడలో మండల కార్యదర్శి ఓర్సు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26కు నూరువంతాలు అవుతుందని ఈ సందర్భంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నల్లమోతు నర్సింహారావు, తమ్మారపు వెంకటేశ్వర్లు, నాగమణి, రాయప్ప పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది సహకారంతోనే అభివృద్ధి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పీజేపీ సీ.ఛటర్జీ అన్నారు. మండలంలోని గంగారంలోలో నూతనంగా నిర్మించిన మెయిన్‌గేట్, గార్డ్‌రూమ్, రిసెప్షన్ రూమ్‌లను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డీ. రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాలలో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికిగానూ నవంబర్‌లో నిర్వహించిన పాలిటెక్నిక్ 3వ,5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబరిచారు. 3వ సెమిస్టర్‌లో సీఎస్సీ నుంచి బొట్టు రామ్‌విద్య, ముటిన హర్షిత, షేక్.యశ్విన్, కలకొడిమ సాయి రామలక్ష్మీ ప్రత్యూష, ఈఈఈ నుంచి ఇమ్మడి ఉదయ్‌గణేష్, ఈసీఈ నుంచి జక్కంపూడి జీవన్‌కుమార్, 5వ సెమిస్టర్‌లో సీఎస్సీ నుంచి ఏ.పవన్‌కుమార్, పీ.గణేష్, ఈసీసీ నుంచి జలగం స్పందన, మహరోజు హిమరత్నం, రేగళ్ల చందనలు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, డిప్లమో డీన్ డా.ఎంవీ.రామచంద్రరావు, అధ్యాపకులు అభినందించారు.

బాలికలకు వైద్య పరీక్షలు

వైరా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల, కాలేజీలోని విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులకు రక్తశాత నిర్ధారణ కోసం పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లేట్లు, ఐరన్ సిరప్‌లను అందజేశారు. పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆపాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, ఉయ్యూరు రామకృష్ణ, జాల నర్సింహారావు పాల్గొన్నారు.

ఫోన్‌పే నుంచి రూ.71 వేలు మాయం

చింతకాని, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తూము నరసింహరావు సైబర్ మోసానికి గురై రూ.71 వేలు నష్టపోయాడు. నరసింహరావు అక్టోబరు 18న హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో బస్‌లో సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. దొంగలు నరసింహరావు ఫోన్‌లోని ఫోన్ పే ద్వారా రూ. 71,900 ఇతర ఖాతాకు బదిలీ చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన బాధితుడు చింతకాని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

చింతకాని, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పారం, నాగులవం చ సమీపంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఈ నెల4న గుర్తు తెలియని వ్యక్తులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ తీగెతో పాటు ఇతర సామాగ్రిని అపహరించారు. విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చింతకాని, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చింతకాని పోలీస్ స్టేషన్ స్వీపర్‌గా పనిచేస్తున్న శ్రీను తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. కొంత నగదును శ్రీనుకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగుల్‌మీరా, ట్రైనీ ఎస్ఐ , సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

» కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దయానంద్



సమావేశంలో మాట్లాడుతున్న మట్టా దయానంద్

కల్లూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నా రు. బుధవారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో మండల స్థాయి గ్రామీణ వైద్యుల సహాయక సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు పేదలకు సేవా దృక్పథంతో ప్రాథమిక స్థాయిలో వైద్య సేవలు అందించాలని కోరారు. గ్రామీణ వైద్యులకు ఎలాంటి సమస్య ఉన్న తాము అండగా ఉంటామన్నారు. ఆర్ఎంపీలకు ప్రభుత్వం తరఫున శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎం సీ ఛైర్మన్ బాగం నీరజాదేవి, ఖమ్మం పిల్లల ప్రత్యేక వైద్యనిపుణులు రాజ్‌కుమార్, ఆర్ఎంపీల కల్లూరు మండల అధ్యక్షుడు కూరపాటి వెంకటరాజు, పూర్ణనందం, రామారావు, ఉస్మాన్‌అలీ, చంద్రశేఖర్, చారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంత మహోత్సవం



గోమాతకు సీమంతం వేడుకలో పాల్గొన్న మహిళలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోవును ప్రత్యక్ష దైవంగా హిందువులు భావిస్తుండగా... గోమాతలోనే సకల దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఆవును పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంపదలు లభిస్తాయని నమ్ముతారు. అంతటి గోమాతకు వేదపండితుల సమక్షంలో సీమంతం చేసి భక్తిని చాటుకున్న ఘటన బుధవారం సత్తుపల్లి పట్టణంలో శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో జరిగింది. గోమాతకు పసుపు, కుంకుమ రాసి.. కొత్తవస్త్రాలు సమర్పించి.. గో ప్రదక్షిణలు చేసి భక్తిని చాటుకున్నారు. సీమం తం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కొన్నేళ్లుగా గోవులను పరిరక్షిస్తూ గోశాల నిర్వహిస్తున్నానంటున్న నిర్వహకులు తేరాల సుబ్రహ్మణ్యశాస్త్రి, వాణీలు మాట్లాడుతూ గోమాతకు సీమంతం నిర్వహించడం పూర్వజన్మ సుకృతం అంటున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల వితరణ

కల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో బుధవారం పీఎస్ఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ తరుపున అండర్-17 బాలికల జట్లకు క్రీడాదుస్తులు, రవాణా చార్జీలు అందజేశారు. ఖమ్మం 68వ జాతీయ అండర్-17 కోకో పోటీలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో త్వరలో జరగనున్నాయి. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ తరుపున పొంగులేటి మాధురి, ప్రసాద్‌రెడ్డిలు అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కోకో అసోసియేషన్ తరుపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ జట్టు తరుపున హెచ్‌వోడీ పసుపులేటి వీరరాఘవయ్య, కోచ్ చీకటి శ్రీదేవి, మేనేజర్ కె. రాధాకృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నరిసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు పీఎస్‌కు ఎస్ఐని నియమించేదెన్నడు..?



కల్లూరు పోలీస్‌స్టేషన్

కల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పర్యవేక్షణ బాధ్యతలు చూసే కీలకమైన అధికారి నియామకం జరగని పరిస్థితి. ఇక్కడ గత నవంబరు నెల 26 వరకు ఏడాది కాలంలోగా విధులు నిర్వహించిన పోలీస్‌సబ్ ఇన్‌స్పెక్టర్ యస్‌కె షాకీర్ బదిలీ వేటుకు గురి అయ్యారు. ఆయన స్థానంలో సీపీ కార్యాలయం నుంచి టీ. నాగరాజు డిసెంబరు 5న కల్లూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న క్రమంలో వారం రోజుల వ్యవధిలోనే ఆయన రైల్వేశాఖకు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. దీంతో కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఇంత వరకు నూతనంగా సబ్ ఇన్‌స్పెక్టర్‌ను పోలీసు ఉన్నత అధికారులు నియమించలేదు. ఇక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ కావాలంటే అధికార పార్టీ నాయకుల అనుగ్రహం ఉండాల్సిందేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న వారు స్టేషన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కల్లూరు పోలీస్‌స్టేషన్ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దున విస్తరించి ఉంది. మరో వైపున నేషనల్ హైవే విస్తరించి ఉంది. శాంతి భద్రతలను కూడా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా కల్లూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా సబ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాల్సిన అవసరం ఉన్నత అధికారులపై ఉంది.

సీఎం కప్ పోటీల్లో మధిర విద్యార్థుల ప్రతిభ



మధిరలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధిర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో మధిర విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలికల కబడ్డీ విభాగంలో మధిరకు చెందిన హరిజనవాడ హైస్కూల్, మడుపల్లి స్కూల్‌లకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి విజేతలుగా నిలిచారు. దీంతో ఈ టీంనుంచి ముగ్గురు భూక్యా శ్రావణి, భానోతు శిరీష, కనకపూడి కావేరీలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27న మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో వీరు ఖమ్మం జిల్లా జట్టుగా పాల్గొంటారు. ఈసందర్భంగా బుధవారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో విజేతలైన జట్టు విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను అధికారులు అభినందించారు. తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, వారికి ప్రశంశాపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్ని, శ్రీనివాసరెడ్డి, చైతన్య, హెచ్ఎంలు నందూరి విజయశ్రీ, తోట నర్సింహారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్ సైట్ రైఫిల్ షూటింగ్‌లో గన్నవరం

వైరా, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో బుధవారం జరిగిన సీఎం కప్ ఓపెన్ సైట్ రైఫిల్ షూటింగ్ పోటీల జూనియర్స్ విభాగంలో జిల్లాస్థాయిలో వైరా మండలంలోని గన్నవరం హైస్కూల్ విద్యార్థినులు వరుసగా ప్రథమ, ద్వితీయ, బహుమతులు సాధించారు. ప్రథమ బహుమతి షేక్.సనా, ద్వితీయ బహుమతి కె. షర్మిళ, తృతీయ బహుమతి కె.సుజిత సాధించారు. ఈ విద్యార్థినులు ఈనెల 27న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో పాల్గొంటారు. విజేతలను ప్రధానోపాధ్యాయుడు చావా శ్రీనివాసరావు, కోచ్ ఆసీఫ్‌పాషా, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ శీలం కృష్ణవేణి అభినందించారు.



బహుమతులు సాధించిన గన్నవరం హైస్కూల్ విద్యార్థినులు

ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

» అమ్మఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని

మధిర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అందిస్తున్న ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని అమ్మఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని అన్నారు. శ్రీనిధి కళాశాలలో ఈనెల 14నుంచి మూడురోజులపాటు మహిళలకు బ్యూటీషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం శిక్షణా కేంద్రాన్ని ఆమె సందర్శించి ప్రసంగించారు. ఈ కోర్సులో కష్టపడితే తమ కాళ్లమీద తాము నిలబడటమే కాకుండా, ఎంతో మందికి ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. మహిళలకు బ్యూటీపార్లర్ రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ట్రైనర్ చీదిరాల శిరీష మాట్లాడుతూ ఈ శిక్షణకు మహిళలనుంచి మంచి స్పందన వచ్చిందని 200మంది శిక్షణ పొందారని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనిల్‌కుమార్ నెహ్రూ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల ఇరుముడి

కారేపల్లి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం అయ్యప్పస్వాములకు ఇరుముడి కార్యక్రమం జరిగింది. స్థానిక గంగమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41మంది అయ్యప్పస్వాములకు గురుస్వాములు ఇరుముడులు ధరింపచేశారు. ఈసందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పట్టాలిచ్చారు... స్థలం మరిచారు



ఇంటిస్థలం పట్టాలను చూపిస్తున్న లబ్ధిదారులు

ముదిగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇంటిస్థలం ధ్రువపత్రం ఇచ్చి స్థలం ఇవ్వకుండా మరిచారు. మండలంలోని వల్లాపురంలో 2023వ సంవత్సరంలో కొంతమంది పేదలను అధికారులు సర్వే నిర్వహించి ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేసుకున్న ఆరుగురికి ధ్రువపత్రాలను అందజేశారు. గ్రామానికి చెందిన గుత్తికొండ నాగమణి, ఇసంపల్లి మరియమ్మ, మేడికొండ ఉమ, గోనుగంటి రేణుక, ఆముదాల నాగరాజు, జొన్నలగడ్డ రేణుకలకు అప్పటి ప్రభుత్వం ఇళ్లపట్టాలను అందజేశారు. కానీ ఇంటి స్థలాన్ని చూపించలేకపోయారు. దీంతో వారికి పట్టాలు మాత్రమే మిగిలాయని, ఇళ్లు కట్టుకొనేందుకు స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు స్థలం చూపించి ఆస్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మధిర రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రధానోపాధ్యాయుడు లింగంపల్లి అప్పారావు కట్‌చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద విద్యావలంటీర్ వెలగం అశోక్‌కుమార్, ఆదూరి విజయ, కనకపూడి నాగేశు, మేకల దానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న హెచ్ఎం అప్పారావు

స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులది కీలకపాత్ర

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

బోనకల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు సూచించారు. బోనకల్‌లో బుధవారం జరిగిన మధిర, బోనకల్ మండలాల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన రోజుల్లో బ్రిటీష్ పాలకులు సీపీఐని రద్దు చేశారని తెలిపారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ సీపీఐగా వ్యాఖ్యానించారు. గత చరిత్రను నేటి యువతకు తెలిపి వారిని చైతన్య పరచాలని సూచించారు. ఈ నెల 26న జరగనున్న వంద సంవత్సరాల ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు వెంకటేశ్వర్లు, యంగల ఆనందరావు, పేరుమాళ్ల ప్రకాషరావు, రహీం, మడుపల్లి లక్ష్మణ్, ఆకేన పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రాలీ రాష్ట్ర సభలను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల22న నిర్వహించనున్న ఆటో, ట్రాలీ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి యస్‌కె లాల్‌మియా కోరారు. బుధవారం కల్లూరులో బుధవారం ఆటో, ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఆటో, మోటర్ కార్మికుల పరిస్థితి దినదిన గండంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మోటారు కార్మికలకు సంక్షేమ బోర్డు, సంవత్సరానికి రూ.12,000 వేలు ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ ఖమ్మం జిల్లా నాయకుడు కె. పుల్లారావు, సంఘం నాయకులు వై.శ్రీను, పి.బాలకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, కిషోర్, చెన్నారావు, హుస్సేన్ తదితరులున్నారు.

'ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు'



బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

వైరా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని షీటీం సభ్యులు హెచ్చరించారు. వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఈవ్‌టీజర్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. ఇటీవల వైరా బస్టాండ్‌లో విద్యార్థినుల పట్ల కొంతమంది ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారనే విమర్శల నేపథ్యంలో షీటీం సభ్యులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల కోసం షీటీం, స్థానిక పోలీసులతో కలిసి పెట్రోలింగ్ ద్వారా భద్రత కల్పిస్తామని తెలిపారు. మహిళలను అలాగే విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే షీటీం నెంబర్ 8712659222 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులైన కానిస్టేబుళ్లు చక్రధర్‌రాజు, కిరణ్, యశోద, వైరా కానిస్టేబుల్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్‌పై చీటింగ్ కేసు నమోదు

తల్లాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయానా పినతల్లి సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకులో నకిలీ అకౌంట్ ద్వారా రూ.లక్షన్నర డబ్బులు డ్రా చేసి మోసానికి పాల్పడిన తల్లాడ మండలం కుర్నవల్లి సొసైటీ ఛైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డిపై బుధవారం రాత్రి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం..

తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తన పేరుతో డీసీసీబీ బ్యాంకులో అకౌంట్ తెరిచి రూ.లక్షన్నర డబ్బులను కుర్నవల్లి సొసైటీ ఛైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి కాజేశాడంటూ అతని పినతల్లి వేమిరెడ్డి పద్మావతి తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎల్ఐసీ నుంచి తనకు వచ్చిన రూ.లక్షన్నర చెక్కును ప్రదీప్‌రెడ్డి తీసుకొని తల్లాడలోని డీసీసీబీ బ్రాంచ్‌లో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఖాతాను తెరిచి చెక్కును ఆఖాతాలో జమ చేసి రూ.లక్షన్నర డ్రా చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. డబ్బులు డ్రా చేసిన తదుపరి అతను అకౌంట్‌ను రద్దు చేశాడని, ఇది జరిగినప్పుడు తాను అమెరికాలో కుమార్తె వద్దనున్నట్లు వివరించింది. బ్యాంకు సిబ్బంది సహకారంతో డబ్బులు కాజేశాడని పద్మావతి ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.